



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



ఈ స్థలం [22 సెంట్లు]

అమ్మబడును




సంప్రదించవలసిన నెంబర్లు

కె. అబెడ్నేగో(రాజు బాబు ) : 9985998066

సిహెచ్. సురేష్ : 9959996243

RAYAVARAM MANDAL, RAYAVARAM VILLAGE, EGDT : 533346



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 151 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 22 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### ట్రంప్ దూకుడు..
## సుంకాలు 10 నుంచి 15శాతానికి పెంపు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలు చెల్లవని అక్కడి సుప్రీం కోర్టు చెప్పిన కొన్ని గంటల్లోనే అధ్యక్షుడు మరో నిర్ణయం తీసుకున్నారు. తీర్పు వచ్చిన కొన్ని గంటల్లోనే ప్రపంచ దేశాలపై 10శాతం సుంకాలు విధించిన ఆయన.. తాజాగా వాటిని మిగతా .. 2లో..

### పరువు నష్టం కేసులో
## కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** మహారాష్ట్రలో నమోదైన ఓ పరువు నష్టం కేసులో బెయిల్‌కు సంబంధించి కొత్త గ్యారంటీ దాఖలు చేయడానికి రాహుల్ గాంధీ శనివారం భివండీ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరయ్యారు. ఆ కేసులో కాంగ్రెస్ మహారాష్ట్ర చీఫ్ హర్షవర్ధన్‌ను తన కొత్త హామీదారుగా పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటి వరకు గ్యారంటర్‌గా ఉన్న కేంద్ర మాజీ మంత్రి శివరాజ్ పాటిల్ గతేడాది డిసెంబర్ 12న మరణించారు. దీంతో ఆయన స్థానంలో కొత్త హామీదారు పేరును మిగతా .. 2లో..

### ఐదేళ్లలో చొరబాటుదారులను
## దేశం నుంచి తరిమేస్తాం : అమిత్ షా



**విశ్వం వాయిస్ న్యూస్ :** నక్సలిజం నుంచి దేశం విముక్తి పొందుతున్నట్లే.. చొరబాటుదారులను ఏరివేయడం కూడా సాధ్యమేనని కేంద్ర మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. అక్రమ వలసదారులను కేవలం ఓటర్ల జాబితా నుంచే కాకుండా.. దేశం నుంచే తొలగిస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో ఈ పనిని పూర్తి చేస్తామని చెప్పారు. అస్సాంలోని కామ్‌రూప్‌లో మిగతా .. 2లో..



## ఆదాయానికి చిరునామాగా
# ఆంధ్రప్రదేశ్

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు

**వినుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 31 నాటికి చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం చంద్రబాబు అన్నారు. మండలానికి ఒక స్వచ్ఛరథం ఏర్పాటు చేస్తున్నామని, వారానికి ఒకసారి గ్రామానికి స్వచ్ఛరథం వస్తుందని చెప్పారు. పల్నాడు జిల్లా వినుకొండలో నిర్వహించిన ' స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరయ్యారు. స్వచ్ఛరథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు మూడు చక్రాల వాహనాలను అందజేశారు. ప్రజావేదిక వద్ద స్టాళ్లను పరిశీలించారు. "స్వచ్ఛ రథం వచ్చినప్పుడు పాత వస్తువులు ఇస్తే బదులుగా నిత్యావసరాలు ఇస్తారు. పరిసరాల పరిశుభ్రతతోపాటు మీకు ఆదాయం వస్తుంది. 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని 2025 జనవరిలో ప్రారంభించాను. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగుతున్నాయి. పచ్చదనం- పరిశుభ్రత, నీరు-మీరుతో ప్రజల వద్దకు వస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. నేను సీఎంగా వచ్చేనాటికి 108 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయింది. దానిని క్రమంగా తొలగిస్తున్నాం. వర్షాలు పడినప్పుడు భూ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. కలుషిత నీళ్లు తాగితే డయేరియా వంటి అనేక సమస్యలు వస్తాయి. ప్రజలకు స్వచ్ఛమైన నీరు ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టాం. ప్రతి నెల మూడో శనివారం ఎక్కడ ఉన్నా కార్యక్రమానికి హాజరవుతున్నా. మున్సిపాలిటీల్లో ఇంటింటికి వెళ్లి చెత్తను వంద శాతం సేకరిస్తున్నారు. మార్చి 31 నాటికి గ్రామీణ ప్రాంతాల్లోనూ చెత్త సేకరించే బాధ్యత ప్రభుత్వానిది. రాబోయే రోజుల్లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అనేక మార్పులు తీసుకొస్తుంది. ఇప్పటికే 'సూపర్ సిక్స్' హిట్ అయ్యింది. 'పేదల సేవలో' కార్యక్రమం కింద మొదటి తేదీనే ఇంటింటికి వస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం కింద డబ్బులు ఇస్తున్నాం. ప్రతి ఎకరాకు నీళ్లిస్తున్నాం. గిట్టుబాటు వచ్చే పంటలు వేయిస్తున్నాం. రైతులకు మిగతా .. 2లో..

### ఏఐ సమ్మిట్‌లో
## యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలి..

### వైఎస్ జగన్ ట్వీట్



**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏఐ సమ్మిట్‌లో యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలిపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండి పడ్డారు. యూత్ కాంగ్రెస్ కార్యకర్తల తీరు మనందరినీ సిగ్గుపడేలా చేసిందంటూ ట్వీట్ చేశారు. "అసలు మన రాజకీయాలు ఎటువైపు వెళ్తున్నాయి?. ఎవరూ మన దేశాన్ని ఎప్పుడూ కించపరచకూడదు. మన మధ్య రాజకీయ విభేదాలు ఎన్ని ఉన్నా.. ప్రపంచం మిగతా .. 2లో..

### అంతర్జాతీయ వేదికను
## రాజకీయ ప్రదర్శనగా మార్చడం బాధాకరం



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** దిల్లీ ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ వైఖరి చూసి దిగ్భ్రాంతి చెందినట్లు ఏపీ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "అంతర్జాతీయ వేదికను రాజకీయ ప్రదర్శనగా మార్చడం బాధాకరం. భారత్ ప్రతిష్ఠను ప్రపంచ దేశాల ముందు తగ్గించే చర్య ఇది. సాంకేతిక ప్రతిభ, ఆవిష్కరణలు మిగతా .. 2లో..

## దిల్లీకి ఉగ్ర ముప్పు..
### నిఘా వర్గాల హెచ్చరికలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ రాజధానిలో ఉగ్ర దాడులు జరిగే అవకాశం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. దిల్లీలోని ఎర్రకోట, చాందినీ చౌక్ ప్రాంతంలోని ఆలయాల వద్ద దాడులు చేసేందుకు పాక్‌కు చెందిన ఉగ్ర సంస్థ లష్కరే తయ్యిబా ప్లాన్ చేసినట్లు తెలిపాయి. ఇందుకు భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశం ఉందన్నాయి. దీంతో పాటు మిగతా .. 2లో..

### తిరుపతి నుంచి ఆధ్యాత్మిక కేంద్రాలకు
## విమాన సర్వీసులు

### కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు



**శ్రీకాళహస్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన తిరుపతి నుంచి దేశంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆధ్యాత్మిక కేంద్రాలకు విమాన సర్వీసులు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. మాజీ ఎంపీ గల్లా జయదేవ్‌తో కలిసి శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. గల్ఫ్ దేశాలకు ఇక్కడ నుంచి వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో విదేశీ విమాన సర్వీసులు రేణిగుంట విమానాశ్రయానికి తెచ్చేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో తమ మంత్రిత్వశాఖకు అధిక శాతం నిధులు కేటాయించినట్లు వివరించారు.

### వైకాపా అరాచకాలకు బుద్ధి చెప్పేందుకు
## ప్రజలు సిద్ధం

### పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా అరాచకాలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. చెప్పులు లేకుండా కాలినడకన కొండ ఎక్కే సంప్రదాయాన్ని మరిచి.. కాలికి చెప్పులు, బూట్లు వేసుకొని వేంకటేశ్వరస్వామి ఫొటోలను ప్లకార్డులుగా వాడతారా? మిగతా .. 2లో..

### మహాపచారం చేసి
## బుకాయింపులా..?
### మంత్రుల మండిపాటు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ శాసన మండలిలో వైకాపా సభ్యులు శ్రీవారి చిత్రపటాల్ని ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగడంపై ఏపీ మంత్రులు ధ్వజమెత్తారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ "నిత్యం అబద్ధాలు, అల్లర్లు తప్ప మీరు సభలో ఏం చేస్తున్నారు? దేవుడిని కూడా రాజకీయాలకు వాడుకునే స్థాయికి ఆ పార్టీ నేతలు దిగజారారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలివేషాల కేంద్రాలుగా మార్చారు. హిందూమత విశ్వాసాల పట్ల జగన్‌కు ముందు నుంచీ చిన్నచూపు ఉంది" అని మంత్రి సంధ్యారాణి విమర్శించారు.

**దేవుడన్నా, ప్రజలన్నా వైకాపా నేతలకు లెక్కలేదు : మంత్రి అనగాని**

శ్రీవారిని రాజకీయ మిగతా .. 2లో..

### ట్రంప్ దూకుడుకు బ్రేకులేయించిన భారత సంతతి లాయర్..
## ఎవరీ నీల్ కత్యాల్..?



**విశ్వం వాయిస్ న్యూస్ :** తన, పర భేదం లేకుండా టారిఫ్‌ల పేరుతో ప్రపంచ దేశాలను వణికించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూకుడుకు అగ్రరాజ్య సుప్రీంకోర్టు బ్రేక్ వేసింది. ఆ సుంకాలేవీ చెల్లవంటూ సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పు రావడంలో భారత సంతతి న్యాయవాది నీల్ కత్యాల్ కీలక పాత్ర పోషించారు. ట్రంప్ టారిఫ్‌లను వ్యతిరేకిస్తూ పిటిషన్లు దాఖలు చేసిన చిన్న వ్యాపారులు, డెమొక్రాట్ పాలిత రాష్ట్రాల కూటమి తరఫున ఆయన సుప్రీంకోర్టులో మిగతా .. 2లో..

### కాంగ్రెస్‌లో ఏ లిస్టులూ ఉండవ్..
## కేవలం మెరిట్ లిస్టే

### తెలంగాణా సీఎం రేవంత్‌రెడ్డి



**అనంతగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాంగ్రెస్‌లో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి పార్టీలో లేదన్నారు. మనలో మనం కొట్లాడుకుంటే పార్టీ కోసం కష్టపడే లక్షలాది కార్యకర్తలకు అన్యాయం చేసినవాళ్లమవుతామన్నారు. ఎన్నికలకు సమగ్ర సన్నద్ధత, ప్రజలతో అనుసంధానమే లక్ష్యంగా తెలంగాణ, ఏపీకి చెందిన డీసీసీ అధ్యక్షులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. "మోతీలాల్ నెహ్రూ దేశం కోసం మిగతా .. 2లో..

### డిగ్రీలు కాదు..
## పరిజ్ఞానం ముఖ్యం

### మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశాన్ని, మాతృ భాషని, చదువుకున్న విద్యా సంస్థని, గురువులని మరిచిపోకూడదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "పరిశోధనకి యువత ప్రాధాన్యం ఇవ్వాలి. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలి. మన పూర్వీకులు మనకి అందించిన సంప్రదాయాలని భావి తరాలకు అందించాలి. మన కట్టు, బొట్టులకు ప్రాధాన్యం ఇవ్వాలి. తెలుగు భాష గొప్పతనాన్ని మిగతా .. 2లో..

### మత్స్యకారుల కుటుంబాలకు
## పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల
### మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు మిగతా .. 2లో..

### ఏఐ సమిట్‌లో
## 'కృష్ణార్జునులు'..



**విశ్వం వాయిస్ న్యూస్ :** దిల్లీలో జరుగుతోన్న ఏఐ సమిట్‌లో కృష్ణార్జునుల హైటెక్ డిజిటల్ రూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రిలయన్స్‌కు చెందిన జియో ఇంటెలిజెన్స్ విభాగం అత్యాధునిక హోలోగ్రామ్ టెక్నాలజీ, కృత్రిమ మేధను ఉపయోగించి భారతీయ ఇతిహాసాల కు సంబంధించిన ఈ చిత్రాలను రూపొందించింది. **'మహాభారత్:** ఏక్ ధర్మ్ యుద్ధ్' సిరీస్‌లోని పలు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## ఆదాయానికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్

టెక్నాలజీ అలవాటు చేస్తున్నాం. అగ్రికల్చర్ నిపుణులను అందుబాటులో ఉంచుతున్నాం. రైతాంగం టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. మైక్రో ఇరిగేషన్, బిందుసేద్యం తదితర కార్యక్రమాలను నేనే ప్రారంభించా. వారసత్వంగా వచ్చే పంటలే పండిస్తే ఆదాయం లేకుండా ఇబ్బందులు వస్తున్నాయి. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో రూ.5కే భోజనం పెడుతున్నాం. మెరుగైన జీవన ప్రమాణాల కోసం పీ4 కార్యక్రమం తీసుకొచ్చాం. ఆదాయం పెంచే మార్గాలను నేర్పించి వారిని ఆదుకుంటున్నాం. కొత్త విషయాలు నేర్చుకునేందుకు ముందుంటా. ఆదాయానికి చిరునామాగా మన రాష్ట్రం ఉండాలి. దేశానికి, రాష్ట్రానికి ఎవరు మంచి చేస్తున్నారనేది ప్రజలు గమనించాలి. ఢిల్లీలో జరిగిన ఏఐ సమిట్‌కు కాంగ్రెస్ వాళ్లు ఆటంకం కలిగించారు. నిన్న ఢిల్లీలో కాంగ్రెస్ కార్యకర్తల వైఖరి చూసి చాలా బాధపడ్డా. దేశానికి ఎంతో మేలు చేసే కార్యక్రమాలకు అండగా నిలవాలి" అని చంద్రబాబు అన్నారు.

### ఏఐ సమ్మిట్‌లో

## యూత్ కాంగ్రెస్ వ్యవహార శైలి..

ముందు అందరం ఐక్యంగా ఉండాలి" అని వైఎస్ జగన్ పేర్కొన్నారు. కాగా, ఇండియా కృత్రిమ మేధ(ఏఐ) ఇంపాక్ట్ సదస్సులో ఎగ్జిబిషన్ హాల్ నంబర్-5 వద్ద యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన తెలపడం కలకలం సృష్టించింది. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో పదుల సంఖ్యలో కార్యకర్తలు ఇక్కడికి చేరుకున్నారు. హఠాత్తుగా టీ-షర్టులు విప్పేసి తమదైన శైలిలో నిరసన వ్యక్తం చేశారు. భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు ఆయా టీ-షర్టులపై ముద్రించి ఉన్నాయి.అంతేకాకుండా భారత ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఫొటోలు కూడా ఉన్నాయి. 'ఎప్‌స్టీన్స్ ఫైల్స్', 'మోదీ రాజీపడ్డారు'అనే వాక్యాలు కూడా ముద్రించారు. నిరసన తెలియజేస్తున్న యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను సదస్సుకు హాజరైన కొందరు ప్రతినిధులు ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది యూత్ కాంగ్రెస్ కార్యకర్తలను అడ్డుకున్నారు.

### అంతర్జాతీయ వేదికను

## రాజకీయ ప్రదర్శనగా మార్చడం బాధాకరం

ఆహ్వానించేందుకే ఇలాంటి గ్లోబల్ వేదికలు. ప్రస్తుతం ప్రపంచమంతా భారత్ వైపు చూస్తోంది. మన దేశ గౌరవాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత" అని లోకేశ్ పేర్కొన్నారు.

## సుంకాలు 10 నుంచి 15శాతానికి పెంపు

15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు సొంత సామాజిక వేదిక ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. సుప్రీం కోర్టు తీర్పును క్షుణ్ణంగా, పూర్తిగా సమీక్షించిన తర్వాత ఈ సుంకాల పెంపు నిర్ణయం తీసుకున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. ఇవి తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేశారు. మున్ముందూ చట్టబద్ధమైన టారిఫ్‌లను జారీ చేస్తామన్నారు. అత్యంత ఆమోదయోగ్యమైన పద్ధతిలో తాము విధించిన టారిఫ్‌లను సుప్రీంకోర్టులో కొందరు వ్యతిరేకించడం దురదృష్టకరమని అధ్యక్షుడు ట్రంప్ అంతకుముందు పేర్కొన్న విషయం తెలిసిందే. అనంతరం, గతంలో తీసుకున్న దానికంటే ఎక్కువ సుంకాలు విధించేందుకు సాధ్యమైన చర్యలన్నీ తీసుకుంటామని పేర్కొన్న ఆయన.. తాజాగా 15శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు.

### పరువు నష్టం కేసులో

## కోర్టుకు హాజరైన రాహుల్ గాంధీ

నమోదు చేయాల్సిందిగా న్యాయస్థానం రాహుల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేత స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మహారాష్ట్రలోని సోనాలే గ్రామంలో జరిగిన ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. అక్కడ ఆయన మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆర్ఎస్ఎస్ హస్తం ఉందని ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు ఆర్ఎస్ఎస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉందని పేర్కొంటూ.. అప్పట్లో సంఘ్ కార్యకర్త రాజేష్ కుంటే భివండీ మేజిస్ట్రేట్ కోర్టులో ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసుపై విచారణ కొనసాగుతోంది.

### ఐదేళ్లలో చొరబాటుదారులను

## దేశం నుంచి తరిమేస్తాం : అమిత్ షా

పోలీస్ 10వ బెటాలియన్ కొత్త క్యాంపస్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఓ సభలో ఆయన ఈమేరకు ప్రసంగించారు. చొరబాటుదారుల ఆక్రమణల నుంచి విడిపించిన స్థలంలోనే ఈ కొత్త క్యాంపస్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. "చొరబాటుదారులను వారు ఆక్రమించిన స్థలాల నుంచి తరిమికొట్టినంత మాత్రాన సమస్య తీరిపోదు. వారు మరోచోట స్థిరపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారిని మొత్తంగా దేశం నుంచే బయటకు పంపించాలి. అక్రమ వలసదారులను బహిష్కరిస్తామని గతంలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చెప్పారు. కానీ.. కాంగ్రెస్ ఆ పని చేయబోదు. ఎందుకంటే వారే ఆ పార్టీకి ఓటు బ్యాంకు" అని అమిత్ షా ఆరోపించారు. చొరబాటుదారులను రక్షించాలనే హస్తం పార్టీ విధానాలు.. అస్సాంకు ముప్పుగా మారాయని విమర్శించారు. ఒకవేళ వారిపై చర్యలు తీసుకునే విషయానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటే.. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఆ విషయాన్ని పొందుపర్చాలని సవాల్ విసిరారు. రానున్న ఐదేళ్లలో ఈశాన్య భారతంలో అస్సాం పారిశ్రామిక కేంద్రంగా మారుతుందని అమిత్ షా చెప్పారు. అనంతరం గువాహటిలో నిర్వహించిన సీఆర్పీఎఫ్ డే పరేడ్‌లో పాల్గొన్నారు. శౌర్యపరాక్రమాలు, దేశభక్తిలో అందరికీ ఆదర్శంగా సీఆర్పీఎఫ్ నిలుస్తోందని పేర్కొన్నారు.

## ఢిల్లీకి ఉగ్ర ముప్పు..

ప్రముఖ నగరాల్లోనూ దాడులు జరిగే అవకాశం ఉందన్నారు. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు ఢిల్లీలో హైఅలర్ట్ ప్రకటించాయి. సున్నితమైన ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. బాంబ్ స్క్వాడ్ బృందాలు రంగంలోకి దిగాయి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని పోలీసులు స్థానికులను కోరారు. గతేడాది ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో.. నిఘా వర్గాల హెచ్చరికలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఢిల్లీ సహా ఇతర ప్రముఖ నగరాల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలని అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశారు.

### ట్రంప్ దూకుడుకు బ్రేకులేయించిన భారత సంతతి లాయర్..

## ఎవరీ నీల్ కత్యాల్..?

వాదనలు వినిపించారు. ఈ టారిఫ్‌ల కోసం ట్రంప్ 1977 నాటి అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టాన్ని (ఐఈఈపీఏ) ఉపయోగించడానికి వ్యతిరేకంగా నీల్ కత్యాల్ సుప్రీంకోర్టులో వాదించారు. ప్రతి వాణిజ్య భాగస్వామి పైనా సుంకాలు విధించడం అన్యాయమని, అది రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సుప్రీంతీర్పు అనంతరం నీల్ మాట్లాడుతూ.. "ఈ రోజు అమెరికా సుప్రీంకోర్టు చట్టపరమైన పాలన, అమెరికన్ ప్రజల భద్రత కోసం నిలబడింది. అధ్యక్షులు శక్తిమంతులే.. కానీ రాజ్యాంగం మరింత శక్తిమంతమైనదని న్యాయస్థానం నిరూపించింది. ప్రాథమిక విలువలను కాపాడింది. ఈ తీర్పు ఓ మైలురాయిగా నిలవనుంది" అని ఆనందం వ్యక్తం చేశారు.

**ఎవరీ నీల్ కత్యాల్..**

నీల్ కత్యాల్ షికాగోలో జన్మించారు. ఆయన తల్లిదండ్రులు భారత్ నుంచి వచ్చిన వలసదారులు. తల్లి ప్రతిభ వైద్యురాలు. తండ్రి సురేందర్ ఇంజినీర్‌గా పనిచేశారు. యేల్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన నీల్.. కెరీర్ తొలినాళ్లలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్టీఫెన్ బ్రేయర్ వద్ద క్లర్క్‌గా పనిచేశారు. 2010లో నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామా హయాంలో యూఎస్ సొలిసిటర్ జనరల్‌గా వ్యవహరించారు. ఇప్పటివరకు అమెరికా సుప్రీంకోర్టులో 50కి పైగా కేసులు వాదించారు. గతంలో పలుమార్లు ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా నీల్ న్యాయస్థానాల్లో వాదించిన సందర్భాలు ఉన్నాయి. 2017లో ట్రంప్ తొలిసారి అధికారంలో కొన్ని దేశాలపై విధించిన ప్రయాణ ఆంక్షలకు వ్యతిరేకంగా నమోదైన కేసులను నీల్ వాదించారు. 'ఇంపీచ్: ది కేస్ అగైనెస్ట్ డొనాల్డ్ ట్రంప్' అనే పుస్తకాన్ని కూడా రచించారు. సంచలనం సృష్టించిన ఆఫ్రికన్ అమెరికన్ జార్జ్ ఫ్లాయిడ్ హత్య కేసులో మిన్నోసోటా రాష్ట్రం తరఫున ప్రత్యేక ప్రాసిక్యూటర్‌గా వాదించారు. అమెరికా న్యాయవిభాగం నుంచి అత్యున్నత పౌర పురస్కారాన్ని అందుకున్నారు.

### వైకాపా అరాచకాలకు బుద్ధి చెప్పేందుకు

## ప్రజలు సిద్ధం

అని మండిపడ్డారు. ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యుల ప్రవర్తనపై రాజమహేంద్రవరంలో ఎన్డీయే కూటమి నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేశ్ మాట్లాడుతూ.. హిందుత్వంపై వైకాపాకి ఏమాత్రం గౌరవం లేదన్నారు. లడ్డూలో వాడిన కల్తీ నెయ్యినే మీ ఇళ్లలో వాడతారా? అని ప్రశ్నించారు. కలియుగ దైవం వెంకన్న పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ఆదేశాల మేరకే సభ్యులు ప్రవర్తించినట్లు స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఛార్జిషీట్‌కి క్లీన్‌చిట్‌కు తేడా తెలియని పార్టీ వైకాపా అని తూర్పుగోదావరి జిల్లా తెదేపా అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. "జగన్‌కు హైందవ సంస్కృతి, సనాతన ధర్మంపై నమ్మకం లేదు. వైకాపాలో ఉన్న హిందువులు జగన్‌ను ప్రశ్నించాలి. క్షమాపణ చెప్పిన తర్వాతే వైకాపా నేతలు రాష్ట్రంలో తిరగాలి" అని అన్నారు. అనపర్తి భాజపా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పులివెందుల ఎమ్మెల్యే దర్శకత్వంలో శుక్రవారం శాసనమండలిలో కలియుగ దైవాన్ని అవమానించారని అన్నారు. భారత చరిత్రలో తొలిసారిగా దేవుణ్ని చట్టసభల్లో అవమానించారని మండిపడ్డారు. సిట్ నివేదిక ఇవ్వకముందే లడ్డూ తయారీలో జంతు కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ నివేదికలో తేలిందని చెప్పారు. జగన్ అసెంబ్లీకి రారు.. ప్రజాసమస్యలపై మాట్లాడరని విమర్శించారు. వైకాపా హయాంలో డ్రైవర్‌ను హత్య చేసి.. మృతదేహాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు డోర్ డెలివరీ చేశారని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మండిపడ్డారు. జగన్ ఇదే విధంగా ప్రవర్తిస్తే వచ్చే ఎన్నికల్లో 11 సీట్లు కూడా రావని ఎద్దేవా చేశారు.

### మహాపచారం చేసి

## బుకాయింపులా..?

ఆయుధంగా వాడుకోవాలని వైకాపా చూడడం మహా పాపమని మంత్రి అనగాని సత్య ప్రసాద్ విమర్శించారు. "చరిత్రలో ఏనాడు లేని విధంగా శాసనమండలిలో శ్రీవారి చిత్రపటాలను ప్రదర్శించారు. దేవుడి పేరుతో రాజకీయ లాభం పొందాలనుకునే వారిని భక్తులు ఎప్పటికీ క్షమించరు. భక్తుల మనోభావాలను వైకాపా నేతలు పదే పదే దెబ్బతీస్తున్నారు" అని దుయ్యబట్టారు. వైకాపా నేతలు మండలిలో చెప్పులేసుకుని వెంకన్న ఫొటోలు ప్రదర్శించడం బాధాకరమని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలులోని వెంకన్న ఆలయంలో మంత్రి శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. తిరుమల నెయ్యిలో కల్తీ జరిగిందన్నది వాస్తవమని.. అందుకే జగన్ అడ్డంగా వాదిస్తున్నారని విమర్శించారు. ఈ విషయంలో జగన్ తిరుమల వెళ్లి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

**వెంకన్నతో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవు : మంత్రి గొట్టిపాటి**

వైకాపా పాపాలను భరించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టంచేశారు. మహాపచారం చేసి బుకాయించుకోవటం వైకాపాకే చెల్లుతోందని మండిపడ్డారు. చట్టసభల్లో దేవుడి ఫొటోను ప్రదర్శించి రాజకీయ నినాదాలు చేయటం మునుపెన్నడూ లేదన్నారు. ఏడుకొండల వాడితో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని అన్నారు.

**హైందవ లోకానికి తీరని అవమానం : మంత్రి పార్థసారథి**

"కాళ్లకు బూట్లు, చెప్పులు వేసుకుని శ్రీవారి ఫొటోలను పట్టుకుని వైకాపా సభ్యులు దుర్మార్గానికి ఒడిగట్టడం దారుణం. జగన్‌కు వెంకన్నస్వామి మీద నమ్మకం లేకపోతే తన పార్టీ ఎమ్మెల్సీలతో అపచారం కార్యక్రమాలు చేయించడం న్యాయమా? నోరుతెరిస్తే శ్రీరంగనీతులు చెప్పే బొత్స సత్యనారాయణ దగ్గరుండి ఈ దారుణాన్ని ప్రోత్సహించడం హైందవ లోకానికి తీరని అవమానం" అని మంత్రి పార్థసారథి మండిపడ్డారు.

**భారత్-బ్రెజిల్ ద్వైపాక్షిక వాణిజ్య లక్ష్యం 20 బిలియన్ డాలర్లు**

భారత్ పర్యటనలో ఉన్న బ్రెజిల్ అధ్యక్షుడు లూలా ద సిల్వాతో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. కీలక ఖనిజాలు, భద్రతా అంశాలపై దృష్టిపెట్టిన ఇరువురు నేతలు.. బహుముఖ సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. వచ్చే ఐదేళ్లలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం 20 బిలియన్ డాలర్లకు మించి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. లాటిన్ అమెరికాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బ్రెజిల్ ఉందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లూలా స్ఫూర్తిదాయక నాయకత్వం, దార్శనికతతో ఇరు దేశాలు ప్రయోజనం పొందుతున్నాయని, ఇది విన్-విన్ భాగస్వామ్యమని అభివర్ణించారు. ఈ రెండు దేశాలు కలిసి పనిచేస్తే.. దక్షిణార్ధ గళం మరింత బలపడుతుందన్నారు. ఉగ్రవాదం, దానికి మద్దతిచ్చేవారు మానవాళికి శత్రువులని ఈ రెండు దేశాలు అంగీకరిస్తున్నాయని చెప్పారు. గతేడాది జులైలో ప్రధాని మోదీ బ్రెజిల్‌లో పర్యటించడం ఇరుదేశ సంబంధాల్లో ఓ మైలురాయి అని సిల్వా పేర్కొన్నారు. ఇప్పటికే ఐదు రంగాల్లో ద్వైపాక్షిక సహకార అజెండాను పునర్నిర్మించుకున్నామని, తాజాగా ఇరు దేశాల భాగస్వామ్యానికి 20 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నామన్నారు. ఐటీ, ఏఐ, బయోటెక్నాలజీ, అంతరిక్ష ప్రయోగాలు వంటి అత్యాధునిక రంగాల్లో భారత్ ఎంతో పురోగతి సాధిస్తోందని, ఇవి బ్రెజిల్‌కు ఎన్నో అవకాశాలు కల్పిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏఐ సమిట్‌లో 'కృష్ణార్జునులు'..

పాత్రల డిజిటల్ రూపాలను ఈ సదస్సులోని తమ స్టాల్‌లో ప్రదర్శించింది. కృష్ణుడు, అర్జునుడు, ఇతరుల రూపాలతో సందర్శకులు మాట్లాడేలా ఏర్పాట్లు చేసింది. సందర్శకులు అడిగిన పలు ప్రశ్నలకు కృష్ణుడు, అర్జునుడి డిజిటల్ రూపాలు సమాధానం ఇస్తుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా, మన ఇతిహాసాలపై యువతకు ఆసక్తి కలిగించాలనే ఉద్దేశంతో ఈ ఏఐ ప్రాజెక్టును రూపొందించినట్లు జియో ఇంటెలిజెన్స్ స్టాల్ నిర్వాహకులు పేర్కొన్నారు. 'మహాభారత్: ఏక్ ధర్మ్ యుద్ధ్' సిరీస్ జియో హాట్‌స్టార్‌లో అందుబాటులో ఉందన్నారు.

### కాంగ్రెస్‌లో ఏ లిస్టులూ ఉండవ్..

## కేవలం మెరిట్ లిస్టే

రూ.వేల కోట్ల ఆస్తులను త్యాగం చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ దేశం కోసం ఎన్నో ఏళ్లు జైలులో ఉన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారు. నేను పీసీసీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉండేది. పార్టీలోనూ కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నాను. నేతలందరినీ కలిసి నా ఆలోచన చెప్పి.. అందర్నీ ఒప్పించాను. అందరం కృషి చేయడంతో పార్టీ ఓటింగ్ పెరిగింది. డీసీసీ అధ్యక్షులుగా బాగా పని చేసిన వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. ఎమ్మెల్యే టికెట్లు పొందలేని వారికి ఎమ్మెల్సీలు ఇచ్చాం. పార్టీ కోసం కృషి చేసిన మరో 60 మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. పార్టీలో అందరి పనితీరు మీద నిరంతరం పర్యవేక్షణ ఉంటుంది. మెరిట్ ఉన్నవారికి పార్టీలో కచ్చితంగా న్యాయం జరుగుతుంది. పార్టీలో ఏ లిస్టులకు చోటు లేదు.. కేవలం మెరిట్ లిస్టు ప్రకారమే అవకాశాలు వస్తాయి. డీసీసీ పదవి ఎంతో విలువైనది.. వచ్చిన అవకాశం దుర్వినియోగం చేసుకోవద్దు. డీసీసీ నుంచి పీసీసీ కావొచ్చు. ఎమ్మెల్యే కావొచ్చు.. ఎంపీ కావొచ్చు.. సీఎం కావొచ్చు" అని రేవంత్ రెడ్డి అన్నారు.

## పరిజ్ఞానం ముఖ్యం

ప్రపంచానికి చాటి చెప్పాలి. భారత్ విశ్వగురువు అయినా.. వేరే దేశం మీద దండయాత్రలు చేయలేదు. కులం కన్నా.. గుణం మిన్న. భారత్ సత్తా ప్రపంచ వేదికల మీద చాటి చెబుతున్నారు. డిగ్రీలు కాదు పరిజ్ఞానం ముఖ్యం. ముఖ్యమంత్రి చంద్రబాబు టెక్నాలజీకి ప్రాధాన్యం ఇస్తున్నారు. ఏఐని అదుపుచేసి ముందుకువెళ్లాల్సిన అవసరం ఉంది. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోనన్న భయం నాకు ఉంది. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చెయ్యాలి. సోషల్ మీడియా తప్పుడు అంశాలకు వేదికైంది. భావితరాలను మంచి మార్గంలో నడపాలి. భవిష్యత్‌లో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోతాయి. దీనికోసం మాట్లాడాల్సిన అవసరం ఉంది. దీనిపై చర్చించాలి. రాజకీయ నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారు. గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వాళ్లంతా ఓడిపోయారు. వ్యవస్థలో అలాంటి వ్యక్తులను ప్రోత్సహించకూడదు. సమాజం అలాంటి వాళ్లని బహిష్కరించాలి. రామాయణాన్ని పాఠ్య పుస్తకాల్లో పొందుపరచాలి. తల్లిదండ్రులు, పెద్దలు పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలి. గూగుల్‌కి ప్రాధాన్యం తగ్గించి.. బుర్రకి పని చెప్పాలి. మంచి సమాజ నిర్మాణానికి మనందరం కృషి చేయాలి" అని వెంకయ్యనాయుడు అన్నారు.

## పెండింగ్ ఎక్స్‌గ్రేషియా విడుదల

జమ చేయబడినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

## వారికి బంపర్ ఆఫర్ అంటున్న పవన్

జనసేన అధినేత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన పార్టీని బలోపేతం చేయడం మీద ఫుల్ ఫోకస్ పెడుతున్నారు. పార్టీలో ఏమి జరుగుతోంది, ఎవరేమిటి అన్నది ఆయన పక్కా సమాచారాన్ని తెప్పించుకుంటున్నారు కూటమితో జత కట్టి అధికరం అందుకుని ఇరవై నెలల సమయం గడచిపోయింది. పవన్ అయితే ఉప ముఖ్యమంత్రిగా అయిదు కీలక శాఖలతో బిజీగా ఉన్నారు. మరో వైపు చూస్తే పార్టీ బాధ్యతలను తాను చూస్తూనే కీలక వ్యక్తులకు అప్పగించినా గతంలో ఉన్నంత ఊపు అయితే సైనికులలో కనిపించడం లేదని గుర్తించారు అధికారంలో ఉన్నపుడు ఒకింత రిలాక్స్ అవడం సహజం. అయితే ఇది ఆ మాదిరి ఉదాశీనత కాదని అసంతృప్తి కూడా ఉందని పవన్ గ్రహించారు అని అంటున్నారు.

వారే కావాలి అంటూ : పార్టీ పెట్టినప్పటి నుంచి భుజం భుజం కలిపి ఎంతో శ్రమ చేసి అధికారంలోకి జనసేనను తీసుకుని వచ్చేందుకు అహరహం శ్రమించిన జనసైనికులలో చాలా మంది మౌనంగా ఉంటున్నారు. వారికి పదవులు దక్కలేదు, అధికారంలోకి వస్తే నామినేటెడ్ పదవులు వస్తాయని వారు భావించారు. అయితే కూటమి ధర్మంతో పాటు పార్టీల బలాబలాలు ఆధారంగా నిష్పత్తి మేరకు జనసేనకు దక్కాల్సిన వాటా దక్కింది. అయితే ఆశావహులు అధికంగా ఉండడంతో అనుకున్న వారికి పెద్దగా అవకాశాలు రాలేదు, దాంతో వారు కొంత నిరుత్సాహ పడ్డారు అలా జనసేనలో చూస్తే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలు అంతా కొంత దిగాలుగా ఉన్నారని గ్రహించిన అధినాయకత్వం వారికి అధిక ప్రయారిటీ ఇవ్వాలని చూస్తోంది అని అంటున్నారు.

కీలక అవకాశాలు : జనసేన పరంగా వారికి తగిన గుర్తింపుని ఇవ్వాలని అలాగే పార్టీ పదవులలో కష్టించి పనిచేసే వారికి న్యాయం చేయాలని అధినాయకత్వం భావిస్తోంది అని అంటున్నారు. ప్రస్తుతం సభ్యత్వ కార్యక్రమాలకు తెర తీసిన అధినాయకత్వం ఎవరైతే ప్రజలతో మమేకం అవుతూ జనసేనను మరింతగా బలోపేతం చేసి సభ్యత్వ నమోదుతో చెప్పిన మేరకు లక్ష్యాన్ని సాధిస్తారో వారికి పదవులు ఇవ్వాలని గౌరవించాలని కూడా అధినాయకత్వం భావిస్తోంది అని అంటున్నారు. ఆ విధంగా పార్టీ పదవులలో న్యాయం చేయడం ద్వారా మునుపటి మాదిరిగా వారిలో చురుకుదనం పుట్టించడమే కాకుండా పార్టీ రేపటి రోజు కోసం వారిని మరింత ఉత్సాహంగా మార్చాలని చూస్తున్నారు.

స్థానిక పోరు మీద : అంతే కాదు ఈ ఏడాదిలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తన వాటా తాను సీట్లను తీసుకుంటుంది. అందులో కూడా పార్టీ కోసం పనిచేసిన వారిని ఎంపిక చేసి వారినే బరిలో నిలబెట్టాలని చూస్తోంది. ఆ విధంగా ఇటు పార్టీలోనూ అటు స్థానికంగా అధికార పదవులలోనూ కష్టించి పనిచేసే వారికే ప్రథమ తాంబూలం అన్నది జనసేన పెద్దలు స్పష్టంగా సందేశం ఇస్తున్నారు. దీంతో జనసేనలో ఇపుడు నూతన ఉత్సాహం వెల్లి విరుస్తోంది. జనసేన తరఫున పనిచేయడానికి కూడా క్యాడర్ లీడర్ మళ్ళీ కదం తొక్కుతున్నారు. తాజాగా పార్టీ సీనియర్ నేతలు క్యాడర్ తో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మరీ పార్టీ గురించి వారిని వివరించడమే కాకుండా వారికి అధినాయకత్వం ఏ విధంగా గుర్తింపు ఇస్తుందో వివరించారు. మొత్తానికి



చూస్తే మార్చి 14న జరుపుకునే జనసేన ఆవిర్భావ సభ నాటికి జనసేన మళ్ళీ కదం తొక్కుతుందని అంటున్నారు. ఆ మీదట ఇదే స్ఫూర్తిగా స్థానిక ఎన్నికల్లో సైతం సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేటుని సాధించేలా పార్టీ టార్గెట్ ని ఫిక్స్ చేసుకుంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




### లావోస్‌లో ఉద్యోగాల పేరిట

## సైబర్ మోసాలు చేయిస్తున్న ముఠా అరెస్టు




**జగిత్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** యువకులను ఉద్యోగాల పేరిట లావోస్‌కు తీసుకెళ్లి వారితో సైబర్ మోసాలు చేయిస్తున్న నలుగురు నిందితులను జగిత్యాల పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని మల్లాపూర్ మండలం ఓబులాపూర్ తండాకు చెందిన ఇస్లావత్ విజయేందర్ అలియాస్ ఆంద్రూ, సారంగాపూర్ మండలం పెంబట్లకు చెందిన మీసాల రాజశేఖర్, రంగపేటకు చెందిన దండగుల కల్యాణ్, ధర్మపురికి చెందిన శ్యాంరావు రాజశేఖర్, ఏపీలోని వైజాగ్‌కు చెందిన రాజు ముఠాగా ఏర్పడ్డారు. లావోస్‌లో ఉద్యోగాల పేరిట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని చాలామందిని నమ్మించి డబ్బులు తీసుకున్నారు. వారిని బ్యాంకాక్, థాయ్‌లాండ్ ద్వారా లావోస్‌కు తీసుకెళ్లి అక్కడ చైనా కంపెనీ ఆధ్వర్యంలో సైబర్ మోసాలు చేయిస్తున్నారు. బాధితుల్లో ఒకరైన జగిత్యాల గ్రామీణ మండలం మోరపల్లికి చెందిన కేశవతుల అరవింద్ అక్కడి నుంచి వచ్చి గతేడాది మార్చి 4న పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇస్లావత్ విజయేందర్‌కు లుక్ అవుట్ నోటీసు జారీ చేశారు. ఈ నెల 16న అతను లావోస్ నుంచి శంషాబాద్ విమానాశ్రయంలో దిగగా సైబర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జగిత్యాలకు తీసుకొచ్చి విచారించగా చాలామంది వద్ద రూ.75 వేల నుంచి రూ.లక్ష వరకు తీసుకొని లావోస్‌కు తీసుకెళ్లినట్లు తేలింది. విశాఖకు చెందిన రాజు లావోస్‌లోనే ఉండగా.. మిగతా నలుగురిని అరెస్టు చేసి రిమాండుకు పంపించినట్లు ఎస్పీ చెప్పారు.

## రాజేంద్రనగర్‌లో విషాదం.. వైద్యం వికటించి 6 నెలల శిశువు మృతి

**రాజేంద్రనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ నగరంలోని రాజేంద్రనగర్‌లో విషాదం చోటు చేసుకుంది. వైద్యం వికటించి 6 నెలల మగ శిశువు మృతి చెందాడు. బండ్లగూడ జాగీర్‌లోని క్రేయాన్స్ ఆసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. విష్ణువర్ధన్ రెడ్డి, అశ్విని దంపతుల కుమారుడికి జ్వరం వచ్చిందని ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ అభిషేక్ ఆధ్వర్యంలో అతడికి వైద్యులు చికిత్స అందించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ చిన్నారి మృతి చెందాడు. కాలం చెల్లిన ఇంజక్షన్లు ఇవ్వడం వల్లే బాలుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### సముద్రపు ఇసుక మైనింగ్ పేరుతో

## విశ్రాంత ఐఏఎస్ మోసం

### ప్రవాస భారతీయుడికి 5 లక్షల డాలర్లకు టోకరా.. సీసీఎస్‌లో కేసు

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇండోనేసియాలో సముద్రపు ఇసుక మైనింగ్ పేరుతో ప్రవాసభారతీయుడిని మోసగించిన విశ్రాంత ఐఏఎస్ నిర్వాకమిది. పెట్టుబడి పేరిట 14 ఏళ్ల క్రితం 5లక్షల అమెరికా డాలర్లు కాజేసి ఇప్పటికీ ఇవ్వకుండా మోసగిస్తున్నారంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. వైజాగ్‌లోని వాల్తేరుకు చెందిన విక్రమాదిత్య బొప్పూడి 1991లో అమెరికాకు వెళ్లి స్థిరపడ్డారు. ప్రస్తుతం వాషింగ్టన్‌లోని ప్రైమ్ సొల్యూషన్స్ కంపెనీ సీఈవో. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విశ్రాంత ఐఏఎస్ దయాచారి పొన్నెకంటితో విక్రమాదిత్యకు 2012లో పరిచయం ఏర్పడింది. తాను ఆయిల్, శాండ్, ఐరన్‌ఓర్ మైనింగ్, ఎనర్జీ తదితర ప్రపంచస్థాయి వాణిజ్యరంగాల్లో పనిచేస్తున్నట్లు అప్పట్లో దయాచారి చెప్పుకొచ్చారు. ఓ రోజు ఇండోనేసియాలో సముద్రపు ఇసుక మైనింగ్ ప్రాజెక్టుకు అనుమతులు చివరిదశకు చేరుకున్నాయని.. పెట్టుబడులు పెడితే భారీగా లాభాలొస్తాయని విక్రమాదిత్యకు ఆశచూపారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని చారికి చెందిన అపిండ్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కార్యాలయానికి వచ్చిన ఆయన చారి సూచించిన బ్యాంకు ఖాతాలకు 5లక్షల అమెరికా డాలర్లను బదిలీ చేశారు. ఈ మేరకు 2012 జులై 5న జాయింట్ వెంచర్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకున్నారు. రోజులు గడిచినా షేర్ సర్టిఫికెట్లను పంపించకపోవడంతో విక్రమాదిత్యకు అనుమానం కలిగింది. 2015లో హైదరాబాద్‌కు వచ్చి ఆరా తీయగా అప్పటి నుంచి ఏదో ఒక కారణం చెప్పి చారి తప్పించుకుంటున్నాడు. మరోవైపు విశ్రాంత ఐఏఎస్‌పై హైదరాబాద్ సీసీఎస్‌లో ఇదే తరహా మోసంపై కేసు నమోదైనట్లు తెలుసుకున్న విక్రమాదిత్య తాజాగా ఫిర్యాదు చేశారు.

## 33 మంది చిన్నారులపై లైంగిక దాడి..

### మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష
### ఉత్తర్‌ప్రదేశ్ కోర్టు సంచలన తీర్పు



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** పదేళ్లలో 33 మంది బాలురపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు, ఆ దృశ్యాలను చిత్రీకరించి విదేశాలకు సరఫరా చేసిన నరరూప రాక్షసుల పాపం పండింది. దీన్ని అత్యంత అరుదైన కేసుగా అభివర్ణించిన ఉత్తర్‌ప్రదేశ్‌లోని పోక్సో కోర్టు నిందితులైన మాజీ ఇంజినీరు దంపతులకు మరణశిక్ష విధిస్తూ సంచలన తీర్పు వెలువరించింది. బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిందితుడు రామ్ భవాన్ చిత్రకూట్ జిల్లాలో నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేసే సమయంలో తన భార్య దుర్గావతితో కలసి 2010-2020 మధ్య బాలురపై లైంగిక అఘాయిత్యాలకు పాల్పడ్డాడు. వారి బాధితుల్లో మూడేళ్ల వయసు చిన్నారులూ ఉన్నారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, కానుకల పేరిట పిల్లలను మభ్యపెట్టి ఇంటికి రప్పించి ఈ దారుణాలకు ఒడిగట్టారు. ఆ అకృత్యాలకు సంబంధించిన 2 లక్షల వీడియోలు, ఫొటోలను ఇంటర్నెట్ ద్వారా 47 దేశాలకు సరఫరా చేశారు. నిందితులపై సీబీఐ 2020 అక్టోబరులో కేసు నమోదు చేసింది.

### 4 ఏళ్ల చిన్నారిపై

## 70 ఏళ్ల వృద్ధుడి అత్యాచారయత్నం



**దేవరపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలంలో అమానుష ఘటన చోటు చేసుకుంది. నాలుగేళ్ల చిన్నారిపై 70 ఏళ్ల వృద్ధుడు అత్యాచారయత్నం చేశాడు. నిందితుడిని స్థానికులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గోపాలపురం మండలం గోపవరానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. పొగాకు బ్యారన్ క్యూరింగ్ పనుల నిమిత్తం ఇటీవల దేవరపల్లి వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## కూతురితో తండ్రి అసభ్య ప్రవర్తన

### పాఠశాలలో నిర్వహించిన గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తో బాలికకు అవగాహన
### ఉపాధ్యాయురాలికి మొరపెట్టుకోవడంతో పోలీసులకు ఫిర్యాదు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కూతుర్ని కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఏడాదిగా భార్య దూరం కాగా అప్పటినుంచి కూతుర్ని వేధించసాగాడు. వీటన్నింటినీ ఆ బాలిక మౌనంగా భరిస్తూ వస్తోంది. అయితే ఈ నెల 19న పాఠశాలలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి ఉపాధ్యాయురాలు అవగాహన కల్పించారు. దీంతో ఆప్యాయంగా తాకడం, దురుద్దేశపూర్వకంగా ముట్టుకోవడానికి గల తేడా బాలికకు అర్థమైంది. అంతే ఒక్కసారిగా తనకు ఎదురవుతున్న వేధింపులను ఉపాధ్యాయురాలికి వివరించి కంటతడి పెట్టింది. పోలీసుల వివరాల ప్రకారం.. విజయవాడ శివారులోని వైఎస్సార్‌కాలనీ(జక్కంపూడి కాలనీ)లో నివసించే పెయింటర్‌కు ఒక్క కుమార్తె(13). స్థానిక పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. దంపతుల మధ్య విబేధాలు తలెత్తడంతో భార్య ఏడాది క్రితం వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో తండ్రి మద్యానికి బానిసై తరచూ కూతుర్ని వేధిస్తున్నాడు. మద్యం మత్తులో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. చివరికి బాలిక ఈ విషయాన్ని ఉపాధ్యాయురాలికి చెప్పడంతో ఆమె సాయంతో పిల్లల సంరక్షణ కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. వారు బాలికను కృష్ణలంకలోని ప్రజ్వల వసతిగృహానికి తరలించారు. కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా తండ్రిపై పోక్సో కేసు నమోదు చేశారు.

# ఆ సమస్యలకు రామబాణం.. కివి ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదలరు..






కివి పండు విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణక్రియకు సహాయపడుతుంది. కంటి చూపు, చర్మ ఆరోగ్యం, బరువు తగ్గడంలో, నిద్ర సమస్యలను నివారించడంలో కూడా కివి పండు కీలక పాత్ర పోషిస్తుంది. మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. కివి పండులో ఔషధ గుణాలతోపాటు.. పోషకాలు పుష్కలంగా దాగున్నాయి.. కివిలో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్‌తో సమృద్ధిగా ఉంటుంది. అందుకే.. కివి పండును సూపర్ ఫుడ్‌గా పరిగణిస్తారు. ముఖ్యంగా, శరీరానికి అవసరమైన విటమిన్-సి కివిలో అధికంగా లభిస్తుంది. దీని గుజ్జులో ఉండే చిన్న నల్లటి విత్తనాలలో ఒమేగా-3 ఫ్యాటీ ఆసిడ్లు కూడా ఉంటాయి.. ఇవన్నీ మొత్తం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. శక్తివంతమైన కివి పండులో ఇందులో విటమిన్ సి (నారింజ కంటే ఎక్కువ), విటమిన్ కె, విటమిన్ ఇ, ఫైబర్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎన్నో సమస్యలకు అమృతఫలంగా పేర్కొంటారు.

**కివి పండు ప్రయోజనాలు..**

వ్యాధి నిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది: ప్రస్తుత కాలంలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుకోవడం చాలా అవసరం. కివి పండులో విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయి. రోజువారీ శరీరానికి అవసరమయ్యే విటమిన్-సి మొత్తాన్ని ఒక కివి పండు అందిస్తుంది.

**గుండె ఆరోగ్యం:** కివి పండు గుండె ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుంది.. తద్వారా గుండెపోటు, ఇతర గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా 2-3 కివి పండ్లను తీసుకోవడం వల్ల రక్తం గడ్డకట్టడాన్ని నివారించవచ్చు. ఆస్పిరిన్ టాబ్లెట్ తరహాలో ఇది గుండెకు రక్షణ కల్పిస్తుంది.

**ఆస్తమా -అలర్జీల నివారణ:** శీతాకాలం సహా.. సీజన్ మారినప్పుడల్లా.. ఆస్తమా, అలర్జీలు ఇబ్బంది పెడుతుంటాయి. కివిలో ఉండే విటమిన్-సి, యాంటీఆక్సిడెంట్లు ఆస్తమా రోగులకు ఉపశమనం కలిగిస్తాయి. గురక, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలను తగ్గిస్తాయి.

**జీర్ణక్రియ మెరుగుదల:** మంచి ఆరోగ్యం కోసం జీర్ణక్రియ సక్రమంగా ఉండటం అత్యవసరం. కివి పండులో డైటరీ ఫైబర్‌తో పాటు, ఆక్టినిడిన్ అనే ఎంజైమ్ ఉంటుంది.. ఇది జీర్ణవ్యవస్థకు చాలా మేలు చేస్తుంది. ఆరోగ్యకరమైన జీర్ణక్రియ కోసం కివిని ఆహారంలో చేర్చుకోవాలి.

**కంటి చూపు మెరుగుదల:** నేటి కాలంలో చిన్నపిల్లల్లో కూడా కంటి సమస్యలు పెరుగుతున్నాయి. కివి పండులో జియాజాంతిన్, లుటిన్ అనే రెండు కాంపౌండ్లు ఉంటాయి. లుటిన్‌ను "ఐ విటమిన్" అని కూడా అంటారు. ఈ రెండు కంటి ఆరోగ్యానికి చాలా మంచివి.. కంటి సంబంధిత వ్యాధులు, క్యాటరాక్ట్‌లు రాకుండా రక్షిస్తాయి. రెటీనా దెబ్బతినకుండా కాపాడుతూ, అధిక కాంతి నుండి కళ్లను రక్షించడంలో సహాయపడతాయి.

**చర్మ ఆరోగ్యం:** కివి చర్మ ఆరోగ్యానికి కూడా చాలా ఉపయోగపడుతుంది. దీనిలో ఉండే కొల్లాజెన్ ఫైన్ లైన్స్, స్మైల్ లైన్స్ వంటి వృద్ధాప్య లక్షణాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కివి పండు గుజ్జును అలోవెరాతో కలిపి రాత్రిపూట ముఖానికి రాసి ఉదయం కడిగేస్తే మొటిమల సమస్య కూడా తగ్గుతుందని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు..

**బరువు తగ్గడం:** బరువు తగ్గాలనుకునే వారికి కివి పండు చాలా సహాయకారిగా ఉంటుంది. దీనిలో అధిక నీటి శాతం, తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉంటాయి. ఈ లక్షణాలు బరువు తగ్గడానికి దోహదపడతాయి.. అదే సమయంలో శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి.

**మంచి నిద్ర:** నిద్రలేమితో (ఇన్సోమ్నియా) బాధపడేవారు తమ ఆహారంలో కివి పండును చేర్చుకోవడం వల్ల మంచి నిద్ర పడుతుందని 2011లో జరిగిన ఒక పరిశోధనలో తేలింది.


**ఇతర ప్రయోజనాలు:**

కివిలో విటమిన్-సి తో పాటు ఐరన్ కూడా ఉంటుంది కాబట్టి, ఐరన్ లోపం (అనీమియా) ఉన్నవారికి ఇది చాలా ప్రయోజనకారి. కివిని బనానాతో కలిపి తీసుకుంటే అనీమియాను అధిగమించవచ్చు.

**ఆహారంలో కివి వినియోగం:** అల్పాహారాన్ని దాటవేయడం మంచిది కాదు. తినడానికి ఆసక్తి లేనప్పుడు, కివిని సలాడ్‌గా, స్మూతీగా లేదా స్నాక్‌గా తీసుకోవచ్చు. కివి, దోసకాయ, కొద్దిగా అల్లం కలిపి చేసుకునే జ్యూస్ వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతో పాటు, బరువు తగ్గడానికి, శరీరాన్ని డీటాక్సిఫై చేయడానికి సహాయపడుతుంది. వేసవిలో ఈ జ్యూస్ డీహైడ్రేషన్ నుండి కూడా రక్షిస్తుంది. కివి పండు ప్రస్తుతం అన్నిచోట్లా సులభంగా లభిస్తుంది. దీని అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా, మీ రోజువారీ ఆహారంలో కివిని చేర్చుకోవడం ఆరోగ్యకరమైన జీవితానికి ఒక మంచి అడుగు అవుతుందని.. ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇది కేవలం అవగాహన కోసం మాత్రమే.. ఏమైనా సమస్యలతో బాధపడుతుంటే.. ఆరోగ్య నిపుణులను సంప్రదించడం మంచిది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 22 ఫిబ్రవరి 2026





www.viswamvoice.com

### దేవీపట్నం మండలంలో

# అక్రమ ఎర్రమట్టి రవాణా

## అధికారుల కళ్లు కప్పి రాత్రివేళ దందా

**దేవీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయతీ పెద్ద రమణయ్యపేట సమీపంలో శనివారం రాత్రి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఎర్రమట్టిని మైదాన ప్రాంతాలకు తరలిస్తున్న మైనింగ్ వ్యాపారుల దందా వెలుగులోకి వచ్చింది. ప్రజలకు తెలియకుండా రాత్రి సమయంలో టిప్పర్లతో భారీగా మట్టి తరలిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఇందులో అధికార పార్టీకి చెందిన కొంతమంది ప్రజాప్రతినిధులే ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తూ ఈ వ్యవహారం నడిపిస్తున్నారనే ఆరోపణలు



తీవ్ర చర్చకు దారితీశాయి. అధికార యంత్రాంగం చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తోందా? లేక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా మౌనం వహిస్తున్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై స్థానిక మండల రెవిన్యూ అధికారిని వివరణ కోరగా దేవీపట్నం మండలంలో ఎలాంటి మట్టిని తరలించడానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు జారీ కాలేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ అక్రమ రవాణా కొనసాగుతుండటం అధికారుల నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేస్తోంది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మైనింగ్ దందాను అరికట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే భవిష్యత్తులో భారీ నిరసనలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# మైత్రి హాస్పిటల్స్ మల్టీ స్పెషాలిటీ, క్రిటికల్ కేర్ హాస్పిటల్ నూతన ప్రారంభోత్సవం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండల కేంద్రంలో ఇండియన్ గ్యాస్ ఆఫీస్ సమీపంలో మైత్రి హాస్పిటల్స్, మల్టీ స్పెషాలిటీ స్టేషన్ మరియు క్రిటికల్ కేర్ హాస్పిటల్ ను జనరల్ ఫిజీషియన్ పి.రమేష్ ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం జరిగింది. నూతన హాస్పిటల్ ప్రారంభోత్సవానికి డాక్టర్ చలిచమ దుర్గాప్రసాద్ మరియు డాక్టర్ శశికళ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.రమేష్ ఎంబిబిఎస్,ఎండి (జనరల్ ఫిజీషియన్) మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు ఉండేలా ఈ నూతన హాస్పిటల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రజలకు అత్యవసర సమయంలో త్వరితగతిన వైద్యం అందేలా మైత్రి హాస్పిటల్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ హాస్పిటల్లో 24 గంటలు అత్యవసర సేవలు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థో పెడిక్, కార్డియాలజీ, న్యూరాలజీ, పీడియాట్రిక్, గైనకాలజీ వంటి విభాగాల్లో సేవలు అందించనున్నట్లు తెలిపారు. అధునాతన టెక్నాలజీ, అనుభవజ్ఞులైన వైద్యుల సహకారంతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తాము సిద్ధమని పేర్కొన్నారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంటూ,విశ్వసనీయ సేవలతో మైత్రి హాస్పిటల్ ప్రజలలో విశ్వాసం పొందేలా పనిచేస్తుందని తెలిపారు. బీపీ, షుగర్, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, అన్ని రకముల విష జ్వరములు, తలనొప్పి, కిడ్నీలో రాళ్లు, హెచ్ఐవి, దగ్గు, ఆయాసం, టిబి, ఆస్తమా, థైరాయిడ్, రక్తస్రావం, కామెర్లు, కీళ్ళ వాతం, వాంతులు, విరోచనాలు, గ్యాస్టిక్ సమస్యలు, ఫిట్స్, పక్షవాతం, పురుగుమందు సేవించిన వారికి, పాముకాటు మరియు తేలు కాటుకు, మూత్రపిండ సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, నరాల బలహీనత, నడుం నొప్పి వంటి సేవలు 24 గంటలూ చూడబడనని ఆయన అన్నారు. చిన్నపిల్లల వైద్యం, ప్రసూతి మరియు గర్భిణీ స్త్రీల సేవలు, గర్భకోశ సంబంధిత వ్యాధులు, జనరల్ సర్జరీ, ఆర్థోపెటిక్ వంటి సేవలు అందించడానికి ప్రత్యేక డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలియజేశారు. మరింత సమాచారం తెలుసుకునేందుకు డాక్టర్ పి.రమేష్ 9133822108 ఫోన్ నెంబర్లను సంప్రదించవచ్చునని అన్నారు. తమ ఆసుపత్రిలో సాంకేతిక పరిజ్ఞానంతో పాటు, అనుభవజ్ఞులైన, డాక్టర్ల పర్యవేక్షణలో సేవలు అందిస్తామని తెలిపారు. అందరి ఆశీస్సులు తమపై ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు ఎండీ డాక్టర్ రమేష్ తెలియజేశారు. ఈ ప్రారంభోత్సవంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు పెందుర్తి అచ్చియ్య, డాక్టర్ రోహిత్ కుమార్(ఎముకల డాక్టర్), డాక్టర్ చంద్రకాంత్ (న్యూరో సర్జన్), డాక్టర్ సతీష్ (జనరల్ సర్జరీ), డాక్టర్ చాందిని (గైనకాలజిస్ట్), డాక్టర్ సామ్యూల్ (పిల్లల డాక్టర్), పలువురు మండల పెద్దలు, మైత్రి హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# మాతృభాషే మన స్వాభిమానం

### బాలికల హాస్టల్‌లో ఘన చైతన్య జ్వాల : డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్



**విశ్వంవాయిస్ న్యూస్ :** మాతృభాషే మన స్వాభిమానమని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. కొవ్వూరు సమీపంలోని IWHC జి.సి. బాలికల హాస్టల్‌లో 8, 9, 10 తరగతి విద్యార్థినుల కోసం శనివారం నిర్వహించిన "మాతృభాషా బోధన" సెమినార్ ఉత్సాహభరితంగా, ఆలోచనాత్మకంగా జరిగింది. విద్యార్థినుల్లో తెలుగు పట్ల గర్వభావం, అవగాహన పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా మాతృభాషల పరిరక్షణ అవసరాన్ని గుర్తు చేస్తూ, ఖచీజూజా 1999లో ఫిబ్రవరి 21ను అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంగా ప్రకటించిన విషయం ప్రస్తావించారు. ప్రధాన అతిథి డా. హిప్నో పద్మా కమలాకర్ మాట్లాడుతూ భాష అనేది కేవలం మాటల సమాహారం కాదు... అది మన సంస్కృతి, మన భావాలు, మన గుర్తింపు అన్నారు. ఒక భాష అంతరించిపోవడం అంటే ఆ భాషకు చెందిన జానపద గాథలు, సామెతలు, సాహిత్యం, జ్ఞాన సంపద, సంప్రదాయాలన్నీ కనుమరుగవడమే" అని పేర్కొన్నారు. మాతృభాషలో నేర్చుకున్న విద్య జీవితాంతం నిలిచే బలమైన పునాది అవుతుందని తెలిపారు. మన తెలుగు భాషను సులభంగా, అందరికీ అర్థమయ్యేలా చేయాలని కృషి చేసిన మహనీయుడు గిడుగు వెంకట రామమూర్తి జయంతి రోజున మనం తెలుగు భాషా దినోత్సవం జరుపుకుంటామని తెలిపారు. ప్రత్యేక అతిథి డా. ఎమ్. హరి విజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రపంచ భాషలను నేర్చుకోవడం అవసరం... కానీ మాతృభాషను విస్మరించడం ప్రమాదకరం. వాడనిది ఏదైనా ఉనికి కోల్పోతుందన్నారు. అందుకే ఇంట్లో తల్లిదండ్రులు పిల్లలతో మాతృభాషలోనే మాట్లాడాలి" అని పిలుపునిచ్చారు. గౌరవ అతిథి డా. మైదవోలు పద్మజా రాణి తెలుగు సాహిత్య వైభవాన్ని వివరిస్తూ, మంచి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సైకాలజిస్ట్ డా. పి. రమేష్ కుమార్ పాల్గొని, మాతృభాషలో భావాలను వ్యక్తీకరించడం వల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం, భావోద్వేగ సమతుల్యత పెరుగుతాయని వివరించారు. మాతృభాష పిల్లల మానసిక వికాసానికి కీలకమని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినుల కోసం వ్యాస రచన పోటీలు నిర్వహించారు. "మాతృభాషా ప్రాముఖ్యత", "తెలుగు నా గర్వం" వంటి అంశాలపై విద్యార్థినులు ఉత్సాహంగా వ్యాసాలు రచించారు. విజేతలకు అతిథులు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమానికి హాస్టల్ వార్డెన్ ఎ. సూర్య కుమారి అధ్యక్షత వహించారు. నిర్వాహకులు ముత్తాల సుబ్బారావు, ఎ.సూర్య కుమారి సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థినులు ప్రశ్నలు అడిగి చర్చల్లో చురుకుగా పాల్గొన్నారు. అతిథులను సన్మానించి కృతజ్ఞతలు తెలియజేస్తూ కార్యక్రమాన్ని ముగించారు. ఈ సదస్సు విద్యార్థినుల్లో మాతృభాషపై చైతన్యాన్ని రగిలించి, తెలుగు గర్వాన్ని మరింత బలపరిచిన ప్రేరణాత్మక కార్యక్రమంగా నిలిచింది. "మాతృభాషను కాపాడటం అంటే మన స్వాభిమానాన్ని కాపాడటమే" అనే సందేశంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

### లోకేష్ ఆత్మీయ సమావేశానికి

# ఎమ్మెల్యే ఆదిరెడ్డి హాజరు



**విశ్వంవాయిస్ న్యూస్ :** ఈరోజు మంత్రి లోకేష్ ఏర్పాటు చేసిన డిన్నర్ ఆత్మీయ సమావేశానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. కేవలం రాజకీయాలే కాకుండా, చాలా సరదాగా గడిచిన ఈ సమయం మర్చిపోలేనిదని... ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు తన మనసులో మాట చెప్పారు. అన్న లోకేష్ ఎంతో ఆప్యాయంగా కుటుంబ సభ్యులందరినీ పలకరించి, తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడం ఆయన గొప్ప మనసుకి నిదర్శనమన్నారు. రాజకీయాల్లో ఎంత బిజీగా ఉన్నా, కార్యకర్తలను, నాయకులను సొంత కుటుంబ సభ్యుల్లా చూసుకునే లోకేష్‌కి... వాసు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ ఆత్మీయత మనందరినీ మరింత ఉత్సాహంగా పని చేసేలా ప్రేరేపిస్తుందని వాసు అన్నారు.

### స్వర్ణాంధ్రలో ఉచిత శిక్షణకు

# దరఖాస్తులు ఆహ్వానం

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మహిళలకు కుట్టు శిక్షణ, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులలో శిక్షణ కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాట్లు నిర్వాహకులు గుబ్బల.రాంబాబు తెలిపారు.కుట్టు ,మగ్గం, బ్యూటిషన్ కోర్సులలో మహిళలకు మాత్రమే ప్రవేశం ఉంటుందని ప్రవేశం కోరగోరేవారు కనీసం ఏడవ తరగతి చదువుకుని ఉండాలన్నారు. ఫిబ్రవరి 27 శుక్రవారం నుండి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని శిక్షణా సమయంలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. శిక్షణానంతరం ఉచితంగా సర్టిఫికెట్లు జ్ఞాపికను బహుకరిస్తామని ఆసక్తి గల అభ్యర్థులు లాలాచెరువులో గల స్వర్ణాంధ్రను స్వయంగా గాని లేదా 9849847489 ఫోన్ ద్వారా సంప్రదించాలని కోరారు. స్వర్ణాంధ్ర నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా ఇప్పటివరకు సుమారు 20500 మందికి ఉచితంగా శిక్షణ అందించామని సుమారు 500 మందికి ఉచితంగా కుట్టుమిషన్లు బహుకరించామని రాంబాబు తెలిపారు.36 మంది తమ సంస్థ ద్వారా శిక్షణ పొంది ప్రభుత్వ పాఠశాలల్లో క్రాఫ్ టీచర్లుగా పనిచేస్తున్నారని కొన్ని వేల మంది స్వయం ఉపాధి పొందుతున్నారని అన్నారు.మహిళల స్వయం ఉపాధి కోసం ఈ శిక్షణను నిరంతరం కొనసాగిస్తున్నామని అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు.

### మహిళలకు 90శాతం సబ్సిడీపై

# పాడి గేదెలు పంపిణీ

### సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్



**రంపచోడవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లాలోని మహిళలు పాడి పరిశ్రమ ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా సబ్సిడీపై పాడి గేదెలు పంపిణీ చేయడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోలవరం జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ శుభం నొక్వాల్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలోని గంగవరం, రాజవొమ్మంగి, అడ్డ తీగల మండలాల్లోని 180 మంది మహిళలకు మూడు కోట్ల 60 లక్షల రూపాయల వ్యయంతో ఒక్కొక్క మహిళా లబ్ధిదారునికి రెండు పాడి గేదలు చొప్పున 90 శాతం సబ్సిడీపై మహిళా మణులకు పాడి గేదెల ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. పాడి గేదెల మంజూరు చేసిన మహిళా మణులకు మూడు నెలల పాటు గేదెలకు పశుగ్రాసం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. అదేవిధంగా ఒక్కొక్క గోకులం షెడ్డు కు 22 లక్షల రూపాయల వ్యయంతో 3 కోట్ల 96 లక్షల రూపాయల వ్యయంతో గంగవరం మండలంలోని 7 గోకులం షెడ్లు, రాజవొమ్మంగి మండలంలో 6 గోకులం షెడ్లు, అడ్డతీగల మండలంలో 5 గోకులం షెడ్లు మొత్తం మూడు మండలాల్లో 18 గోకులం షెడ్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గోకులం షెడ్లు నిర్మించడం జరిగిందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలోని మహిళలు పాడి పరిశ్రమ ద్వారా అభివృద్ధి చెందే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రకాలైన పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని ఆయన తెలిపారు. గిరిజన ప్రాంతంలోని గిరిజనులు వివిధ రకాలైన పథకాలు సద్వినియోగ పరుచుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన అన్నారు. మహిళలకు ఏర్పాటుచేసిన పాడి గేదెలకు ఇన్సూరెన్స్, మూడు నెలల పాటు పశుగ్రాసం, గోకులం షెడ్లలో ఏ విధంగా పాడి గేదెలను పెంచుతున్నది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని రంపచోడవరం ఎపిఓ జనరల్ డిఎన్వి రమణను, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్‌ను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.

# తాపేశ్వరం అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం తాపేశ్వరం గ్రామంలో దేవుడు కాలనీ లో చేపట్టిన సి.సి రోడ్లు, డ్రైన్ పనులను రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు శనివారం పరిశీలించారు. దేవుడు కాలనీలో పనులు చేపట్టిన ప్రతీచోట తిరిగి డ్రైన్స్ లెవిలింగ్ ను పరిశీలించారు. నాణ్యత లోపం లేకుండా పనులు త్వరగా పూర్తిచెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ముత్యాల పట్టాభి, నూని వీర్రాజు, వి.శ్రీనివాస్, చుక్కన సుబ్బరాజు, ముత్యాల సత్యనారాయణ, వల్లూరి భద్రరావు, తాపేశ్వరం సర్పంచ్ వాసంశెట్టి శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, కోరా లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# అగ్నిప్రమాద బాధితులకు బిజెపి నాయకుల పరామర్శ

### - నిత్యావసర వస్తువులు, 25కిలోల చొప్పున బియ్యం పంపిణీ

**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి రూరల్ కాతేరు గ్రామపంచాయతీ పరిధిలోని సుబ్బారావు పేటలో మంగళవారం అగ్నిప్ర మాదం సంభవించి, తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమవడంతో మద్దా నూతయ్య, వనులమ్మలు కట్టుబట్టలతో మిగిలారు. విషయం తెలుసుకుని రూరల్, రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు తగరం సురేష్ బాబు, 1వ మండల అధ్యక్షులు నాగల శివకుమార్, బిజెపి సీనియర్ నాయకులు కొల్లి వెంకట నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కండెల్లి సురేష్, మల్లు వలస రాంబాబు, పెండ్యాల నాగబాబు, తిప్పర్తి జ్యోతి తదితరులు వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా మద్దా నూతయ్య, వనులమ్మలకు నిత్యావసర వస్తువులు, 26కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేసారు. పరామర్శించారు. ఈసందర్భంగా యానాపు ఏసు మాట్లాడుతూ అధికారుల దృష్టికి, అలాగే ఎంపి దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజుల దృష్టి తీసుకెళ్ళి, బాధితులకు తగు న్యాయం చేస్తానని తెలిపారు.



# పిఎంపి రాష్ట్ర కార్యవర్గ సమావేశం




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్(ది పిఎంపి అసోసియేషన్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు అధ్యక్షతన రాజేంద్రనగర్ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు పాల్గొని మాట్లాడుతూ గత ఏడాది అంతా క్యాన్సర్ పై క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అన్ని జిల్లా, మండల కమీటీలను అభినందిస్తూ, ఈ ఏడాది అంతా అవయవదానం, జీవన దాన్ పై ముమ్మరంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. రాష్ట్ర అధ్యక్షులు తోరాటి ప్రభాకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించే ప్రజా ఆరోగ్య కార్యక్రమాలలో విధిగా హాజరవ్వాలని,నూతనంగా జాయిన్ అయిన సభ్యులు సంఘ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రాథమిక వైద్య సేవలందించేలా మండల నాయకులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్య సలహాదారు ఎన్ జయసూర్య, రాష్ట్ర కోశాధికారి ఎస్ వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగుమళ్ళ రాంబాబు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె జనార్దన్, రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు, రాష్ట్ర మీడియా కన్వీనర్ బళ్ళా శ్రీనివాసరావు, పి.దేవానందం, ఏఆర్కే పరమేశ్వర్లు, ఆనందం సుబ్బారావు,ఎమ్ జయరామ్, అబ్దుల్ రెహమాన్ ఖాన్, జితేంద్ర, గోరంట్ల శేషయ్య, శ్రీనివాస్, ఆర్.భూపతి, ఎన్.సింహాచలం, కె.జనార్దనరావు, షేక్ తనీషా, మట్టా వీరబాబు, యమ్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# వెంకన్న స్వామితో పెట్టుకుంటే పుట్టగతులుండవు

## వైసీపీపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఫైర్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భక్తుల మనోభావాలను వైఎస్సార్ సీపీ నాయకులు దెబ్బతీస్తున్నారని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మండిపడ్డారు. శ్రీవారిని రాజకీయ ఆయుధంగా వాడుకోవాలని వైఎస్సార్సీపీ చూడడం మహా పాపమని ఆయన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడుకొండల వాడితో పెట్టుకుంటేపుట్టగతులుండవని సుభాష్ ధ్వజమెత్తారు. శ్రీవారి పేరుతో రాజకీయ లాభం పొందాలనుకునే వారిని దేవుడు క్షమించరు - శ్రీవారి ఫోటోలను పట్టుకుని కాళ్లకు బూట్లు, చెప్పులు వేసుకుని వైఎస్సార్సీపీ సభ్యులు దుర్మార్గానికి ఒడిగట్టారని మంత్రి తెలిపారు. శ్రీవారిభక్తుల మనోభావాలను వైఎస్సార్సీపీ నేతలు పదే పదే దెబ్బతీస్తున్నారని మంత్రి సుభాష్ దుయ్యబట్టారు. వైఎస్సార్సీపీ నేతలు ప్రజలు నేరుగా ఎన్నుకున్నశాసనసభ సమావేశాలకు మాత్రంరారని, అదే వారు రద్దుచేయాలనుకున్న శాసనమండలికి మాత్రం హాజరవుతూ వాటి సమావేశాలను అడ్డుకుంటారని సుభాష్ విమర్శించారు. అటు దేవుడన్నా, ఇటు ఎన్నుకున్న ప్రజలన్నా వైఎస్సార్సీపీ నేతలకు లెక్కలేదని అన్నారు. హిందువుల మనోభావాలు, శ్రీవారి భక్తులమనోభావాలపై జగన్ రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు ముప్పేట దాడులు చేయడాన్ని మంత్రి వాసంశెట్టి సుభాష్ ఖండించారు. జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో కలియుగదైవం శ్రీవెంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని నినాదాలు చేస్తూరాజకీయం చేసే నీచానికి దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూమత విశ్వాసాల పట్ల, తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పట్ల జగన్మోహన్ రెడ్డికి ముందు నుంచీ చిన్నచూపు ఉందని, పరమపవిత్రమైన దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేశారని మంత్రి సుభాష్ ఆరోపించారు. స్వార్ధ రాజకీయాల కోసం దేవుణ్ణి వాడుకుంటే ప్రజలు ఉపేక్షించరన్నారు. ఏడుకొండల వాడితో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని చరిత్ర చెప్తోందని ఆయన తెలిపారు. శ్రీవారి పేరుతో రాజకీయ లాభం పొందాలనుకునే వారిని ఆ దేవుడు ఎప్పటికీ క్షమించరని మంత్రి అన్నారు.

### అమలాపురం-రావులపాలెం జాతీయ రహదారి

# 216ఈ నాలుగు లైన్లుగా నిర్మాణం ప్రతిపాదన

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురం నుంచి రావులపాలెం వరకు ప్రతిపాదిత జాతీయ రహదారి 216ఈ ను కనీసం 27 మీటర్లు (90 అడుగులు) వెడల్పుతో నిర్మించేందుకు అనువుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రహదారులు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు అధికారులను ఆదేశించారు. శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, జాతీయ రహదారుల శాఖ ఇంజనీర్లు, రెవెన్యూ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కోనసీమ ప్రజల చిరకాల వాంఛగా ఉన్న ఈ రహదారిని నాలుగు లైన్లుగా అభివృద్ధి చేయాలన్న అభ్యర్థనల మేరకు 27 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదనలు రూపొందించి సమర్పించాలని సూచించారు. భూసేకరణ, ప్రస్తుత భవనాల తొలగింపు, నష్టపరిహారం వంటి అంశాలపై సమగ్ర సర్వే అనంతరం వివరమైన నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడుతూ, కొత్తగా



ఏర్పడిన కోనసీమ జిల్లాకు రైలు మార్గం వంటి సౌకర్యాలు లేవని, ప్రాంతాన్ని బాహ్య ప్రపంచంతో అనుసంధానం చేయడానికి నాలుగు లైన్ల జాతీయ రహదారి అత్యవసరమని తెలిపారు. కోనసీమ ప్రాంతం సర్క్యూట్ టెంపుల్ టూరిజం, బీచ్ టూరిజం, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు, ఆక్వా రంగాలకు ప్రసిద్ధి చెందినదని పేర్కొన్నారు. రాజమహేంద్రవరం విమానాశ్రయం, విజయవాడ వంటి ప్రాంతాలకు తక్కువ సమయంలో చేరుకోవడానికి ఈ రహదారి ఎంతో ఉపయోగకరమన్నారు. అమలాపురం పార్లమెంట్ సభ్యులు గంటి హరీష్ మాధుర్ మాట్లాడుతూ, నాలుగు లైన్ల రహదారి కోనసీమ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు. రహదారి మార్గం వెంబడి ఉన్న ఆస్తుల యాజమాన్యాలు ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. భూసేకరణలో నష్టపరిహారం గరిష్టంగా చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కోనసీమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశం అనంతరం జాతీయ రహదారి 216ఈ మార్గాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిశాంతి, ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, ఆర్డీవో కె. మాధవి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, జాతీయ రహదారుల రీజనల్ ఆఫీసర్ జి. హరికృష్ణ, జాతీయ రహదారుల కార్యనిర్వాహక ఇంజనీర్ విశాఖపట్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కిమ్స్ ప్రాంగణంలో వైభవంగా ప్రపంచ తెలుగు మహాసభలు

### కిమ్స్ చైర్మన్ చైతన్య రాజు ఆధ్వర్యంలో ఘన ఏర్పాట్లు




**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

తెలుగు భాష, సంస్కృతి, సాహిత్య వైభవాన్ని ప్రపంచ వేదికపై మరోసారి ప్రతిష్ఠాత్మకంగా చాటిచెప్పే లక్ష్యంతో ప్రపంచ తెలుగు మహాసభలు ను కోనసీమ గడ్డపై నిర్వహించడం గర్వకారణమని కిమ్స్ విద్యాసంస్థల చైర్మన్ చైతన్య రాజు తెలిపారు. ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీలలో అమలాపురంలోని కిమ్స్ మెడికల్ కళాశాల ప్రాంగణంలో అత్యంత వైభవంగా ఈ మహాసభలు జరగనున్నట్లు ఆయన పాత్రికేయుల సమావేశంలో వివరించారు. తెలుగు భాష పరిరక్షణ, అభివృద్ధి, ప్రచారం లక్ష్యంగా ఈ మహాసభలను సమగ్రంగా రూపకల్పన చేసినట్లు పేర్కొన్న ఆయన, రెండు రోజుల పాటు సాహిత్య, సాంస్కృతిక, విద్యా, చర్చా వేదికలతో ఈ కార్యక్రమం విశేషంగా సాగనుందని చెప్పారు. కోనసీమ జిల్లాలో ఇంతటి స్థాయిలో అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన మహాసభలు జరగడం చారిత్రాత్మక ఘట్టమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మహాసభల ప్రధాన వేదికకు స్వర్గీయ నందమూరి తారక రామారావు పేరు ఖరారు చేసినట్లు చైతన్య రాజు తెలిపారు. తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన మహానేతకు ఇది నిజమైన నివాళి అని పేర్కొన్నారు. మహాసభలకు ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల గవర్నర్లు, ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణం రాజు, భారత మాజీ సీజేఐ ఎన్.వి. రమణతో పాటు సుమారు 20 మంది హైకోర్టు న్యాయమూర్తులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని ఇప్పటికే ఆహ్వానించామని, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని కూడా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. తెలుగు ఆధ్యాత్మిక, సాహిత్య రంగాల్లో ప్రసిద్ధులైన చాగంటి కోటేశ్వరరావు, గరికిపాటి నరసింహారావు, తనికెళ్ల భరణి వంటి ప్రముఖులు సభలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. రెండు రోజుల పాటు మొత్తం ఎనిమిది ప్రధాన సభలు నిర్వహించబడతాయని, ప్రతి సభలో తెలుగు భాషా వైభవం, సాహిత్య వారసత్వం, భవిష్యత్ దిశలపై చర్చలు జరుగుతాయని తెలిపారు. భారీ స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు, సాంప్రదాయ నృత్యాలు, హరికథ, సంగీత ప్రదర్శనలు, కవిసమ్మేళనాలు కూడా ఈ మహాసభలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని చెప్పారు. ఈ మహాసభల్లో ముఖ్యంగా చర్చకు రానున్న ప్రతిపాదనగా తెలుగు మాధ్యమంలో చదువుకున్న వారికి 10 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌ను చైతన్య రాజు వెల్లడించారు. తెలుగు భాషను ప్రోత్సహించాలంటే విద్యా రంగంలో దానికి గౌరవప్రద స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. తెలుగు భాషా పరిరక్షణ కేవలం భావోద్వేగ అంశం మాత్రమే కాకుండా, ఆచరణలో అమలు చేయాల్సిన విధానమని, ఇందుకు సమగ్ర చర్చలు జరిపి తీర్మానాలు ఆమోదించనున్నట్లు తెలిపారు. తెలుగు భాషా అభివృద్ధికి సేవలందించిన బాలయోగి, మెట్ల సత్యనారాయణ వంటి మహనీయుల పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, కోనసీమ జిల్లాలో ఇంతటి గొప్ప సాహిత్య మహాసభలు నిర్వహించడం అభినందనీయమని, చైతన్య రాజు తెలుగు భాష పట్ల చూపుతున్న నిబద్ధత ప్రశంసనీయం అని పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు ఈ కార్యక్రమం ద్వారా మరింత ఖ్యాతి చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, బీజేపీ సీనియర్ నాయకులు మోకా వెంకట సుబ్బారావు, బోనం సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ప్రపంచ తెలుగు మహాసభలు కేవలం ఒక సాంస్కృతిక వేడుక మాత్రమే కాకుండా, తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తాయని చైతన్య రాజు స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వాసులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భాషా సంరక్షణకు నూతన దిశ నిర్దేశం చేయడం ఈ మహాసభల లక్ష్యమని తెలిపారు. తెలుగు తల్లి మహిమను చాటిచెప్పే ఈ మహాసభలు అమలాపురం నగరాన్ని జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు పొందేలా చేస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కోనసీమ గడ్డపై జరగనున్న ఈ చారిత్రాత్మక మహోత్సవానికి అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, సాహిత్యాభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# మందేశ్వర స్వామి వారి శనివారం పూజల ద్వారా ఆదాయం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం నందు శనివారం శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు మరియు ఇతర పూజల ద్వారా ఆదాయ వివరములు ముఖమండపం 9 × 700/- = 6300/-ఏకాదశ రుద్ర తైలాభిషేకం168ఐ 250/- =42000/-మహాన్యాస పూర్వక తైలాభిషేకం 246 × 175/- =43,050 /-, తైలం సమర్పించి దర్శనం 158× 80/- =12,640 /-, తిలదానం 5× 50/- = 250 /- మహాన్యాస పూర్వక తైలాభిషేకం (పరోక్ష)1 ఐ 400/- = 400/ మొత్తం రూ .104640లి/- అన్నప్రసాదం విరాళాలు, రూ.26511 /-పరోక్ష పూజలు ద్వారా రూ.9200/-మొత్తం రూ.1,40,351 /- లు ఆదాయం వచ్చినదని దారపురెడ్డి సురేష్ బాబుసహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

### వాడకము లేకుండానే

# భారీ విద్యుత్ బిల్లులు

### ఇద్దరు ఆడపిల్లల తల్లికి న్యాయం చేయాలి



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అల్లవరం మండలం యెంట్రుకోన గ్రామంలో ఓ నిరుపేద మహిళ ఎదు ర్కొంటున్న విద్యుత్ బిల్లుల సమస్య స్థానికంగా తీవ్ర ఆందోళనకు దారి తీసింది. భర్తను చాలా సంవత్సరాల క్రితం కోల్పోయిన ఆమె, ప్రస్తుతం ఇద్దరు ఆడపిల్లలతో కలిసి అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటుండగా, కుటుంబానికి స్థిరమైన ఆదాయం ఏదీ లేదు. ప్రభుత్వం అందిస్తున్న విధవ పెన్షన్‌నే ఆధారంగా చేసుకుని రోజువారీ ఖర్చులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి దుర్భర పరిస్థితుల్లో ఉండగానే, ఆమెకు ప్రతి నెలా విద్యుత్ వినియోగం చాలా తక్కువగా ఉన్నప్పటికీ రూ.1700 నుండి రూ.2000 వరకు భారీ విద్యుత్ బిల్లులు రావడం ఆ కుటుంబాన్ని తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. చిన్న ఇంట్లో కొన్ని లైట్లు, ఒక ఫ్యాన్ తప్ప మరే విద్యుత్ పరికరాలు లేని పరిస్థితిలో ఇంత భారీ బిల్లు రావడం అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ మొత్తం పూర్తిగా విద్యుత్ బిల్లుల చెల్లింపుకే సరిపోతుండటంతో, పిల్లల పోషణ, విద్య, వైద్య అవసరాలు వంటి ప్రాథమిక అవసరాల కోసం ఆమె తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆమె మానసికంగా కూడా తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. "పిల్లల చదువు ఆగకూడదనే ఆలోచనతోనే బిల్లులు చెల్లిస్తున్నాను. కానీ ఇలా కొనసాగితే జీవనం ఎలా సాగించాలి?" అని ఆమె కన్నీటి పర్యంతమవుతున్నారు. గ్రామస్థులు కూడా ఈ సమస్యపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేద కుటుంబంపై ఇంత భారీ భారం పడటం అన్యాయమని, సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

**బాధిత మహిళ, గ్రామస్థులు అధికారులను కోరుతున్న అంశాలు ఇవి**

(1)ఇంటి విద్యుత్ మీటర్‌ను తక్షణం సాంకేతికంగా పరిశీలించాలి
(2)అధిక బిల్లుల కారణాన్ని స్పష్టంగా తెలియజేయాలి
(3)అవసరమైతే గత బిల్లులను సవరించి న్యాయం చేయాలి
(4)పేద కుటుంబం కావున ప్రత్యేక సబ్సిడీ లేదా రాయితీ కల్పించాలి.

పేదల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిజంగా అవసరమైన వారికి చేరాలంటే ఇలాంటి సమస్యలను అధికారులు సున్నితంగా పరిగణించి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. యెంట్రుకోన గ్రామానికి చెందిన ఈ నిరుపేద తల్లికి న్యాయం జరిగేలా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలని ప్రజలు, గ్రామ పెద్దలు విజ్ఞప్తి చేస్తున్నారు. బాధిత కుటుంబం తరఫున గ్రామస్థులు అధికారులు దృష్టికి ఈ సమస్యను తీసుకువచ్చారు. ఇప్పుడు సంబంధిత శాఖ స్పందన కోసం గ్రామమంతా ఎదురుచూస్తోంది.

### విద్యా బాల మందిర్‌లో

# కవలలు దినోత్సవం వేడుకలు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం కొత్తపేట విద్యా బాల మందిర్ హైస్కూలులో చదువుతున్న కవలలు బొమ్మి సౌమ్య, బొమ్మి సుజిత్ (1 వ తరగతి) కుడిపూడి శ్రావ్య కుడిపూడి శ్రావ్య (2 వ తరగతి) గ్రంధి అలేఖ్య లక్ష్మి , గ్రంధి సత్య సాయి రామ్ (6 వ తరగతి) రామోజు జయమణి విమల, రామోజు జయమణి ముద్ర (8 వ తరగతి) వీరిని పాఠశాల కరస్పాండెంట్ రామోజు అనురాధ ఆశీర్వదించి అక్షింతలు వేసి అభినందనలు తెలిపారు. ఒకే అండం ఫలదీకరణం చెంది రెండుగా విభజితమైతే ఐడెంటికల్ ట్విన్స్ పుడతారు అని రెండు వేర్వేరు అండాలు రెండు శుక్రకణాల తో ఫలదీకరణం చెందితే ఫ్రాటెర్నల్ టిన్స్ పుడతారు అని జీవశాస్త్ర ఉపాధ్యాయులు భూషి శ్యామల తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రదాన ఉపాధ్యాయులు నూకపేయి శివరత్నం ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొని కవలలను అభినందించారు.

# మంద కృష్ణ మాదిగ అంబేద్కర్‌కి క్షమాపణలు చెప్పాలి



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్న అంబాజీపేట మండల మాలమహానాడు ఆధ్వర్యంలో ప్రపంచ మేధావి,భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.ఆర్ అంబెడ్కర్ పై మాదిగ దండోరా నాయకుడు మందా కృష్ణ మాదిగ అనుచిన వాక్యాలు చేస్తూ అంబెడ్కర్ తో పోల్చుకుంటూ అంబేద్కర్‌ని అవమానిస్తూ చేసిన వాక్యలు పట్ల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్అం బెడ్కర్ కొనసీమ జిల్లా దళిత ఐక్య వేదిక పిలుపు మేరకు శనివారం జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ లలో మందా కృష్ణ మాదిగ మీద పోలీస్ కేసు లు పెట్టె భాగం లో అంబాజీపేట పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టడం జరిగిందని అంబాజీపేట మండల మాల మహానాడు నాయకులు తెలిపారు. మందా కృష్ణ మాదిగ అంబెడ్కర్ కాళ్ళు పట్టుకొని క్షేమాపణ చెప్పాలని లేని పక్షం లో మందా కృష్ణ మాదిగను డాక్టర్ బి.ఆర్ అంబెడ్కర్ జిల్లాలో అడుగు పెట్టనివ్వమని దళిత నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నెల్లి వెంకటరమణ, నూకపెయి చిన్న, జల్లి బాలరాజు,నాగాబత్తుల సుధాకర్, బీర సురేష్, గోసంగి కుమారస్వామి,కత్తుల బాబులు, మూలపర్తి మోహనరావు, నాగవరపు అన్నవరం,సత్యాల కొండలరావు,నెల్లి చిన వెంకటేశ్వర్రావు, ఒరిగంటి వెంకట్రావు, మాత సత్యనారాయణ, గోగి శ్రీరాముర్తి,గోసంగి శేఖర్,నెల్లి బాలచంద్రుడు, మోకా శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 27వ మాతృభాషా దినోత్సవ వేడుకలు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య, ఉపాధ్యాయ బృందం తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతిని వెలిగించారు.బాలవిహార్ పిల్లలు 3వ తరగతి నుండి 9వ తరగతి వరకు తమ తెలుగు పాఠ్య పుస్తకాలలోని దాదాపు 60 మంది తెలుగు కవుల విశిష్టతలను తెలుపుతూ వినూత్న రీతిలో 27వ మాతృభాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. కవుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ అనేక ప్రసంగాలు చేసారు. పద్యాలు, పాటలు పాడారు.కరస్పాండెంట్ బుద్ధచంద్రదేవ్ ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రంలో ఉదయం మాతృభాషపై ప్రసారమైన ప్రముఖ కవి రెంటాల శ్రీవేంకటేశ్వరరావు ప్రసంగాన్ని రికార్డు చేసి సభలో వినిపించారు. ఐరాస ప్రకటనను అనుసరించి 2000 సంవత్సరం నుండి ఇప్పటివరకు ప్రతి సంవత్సరం తమ స్కూలులో క్రమం తప్పకుండా మాతృ భాషా దినోత్సవాలు జరుపుతున్నామని దేవ్ అన్నారు.3వ తరగతి నుండి 9వ తరగతి వరకు దాదాపు 150మంది చిన్నారులు, 10మంది టీచర్లు ఈ కార్యక్రమంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# కవలలందరికీ హ్యాపీ ట్విన్స్ డే శుభాకాంక్షలు

### ఒకే రూపం అపురూపం హ్యాపీ హ్యాపీ కవలలు – నేడు కవలల దినోత్సవం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒకే కాన్పులో ఇద్దరూ లేదా ఆపైన పుట్టిన పిల్లలను కవల పిల్లలు అంటారు. కవల పిల్లలను చూడగానే చాలా ఆనందంగా అనిపిస్తుంది.ఒకే రూపంతో ఇద్దరూ అపురూపంగా కనిపిస్తుంటారు.ఇక వీరి మాట రూపు ఆవ భావాలు మనోభావాలు కూడా ఒకే విధంగా ఉంటాయి.ఒకే కాన్పులో ఇద్దరూ లేదా అంతకంటే ఎక్కువ మంది జన్మిస్తే వారిని కవలలు అంటారు.చాలా మందికి ఇద్దరు జన్మనిస్తారు. కానీ అరుదుగా ఇద్దరో ముగ్గురో మాత్రం ముగ్గురు లేదా నలుగురికి జన్మనిచ్చిన సంఘటనలు ఉన్నాయి. ఫిబ్రవరి 22 ను జాతీయ కవలల దినోత్సవంగా జరుపుకుంటారు. దానిని పురస్కరించుకుని కొత్తపేటకు చెందిన గుబ్బల మూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.మూర్తి ఝాన్సీ దంపతులకు వర్షిని, వర్ధిని కవలలుగా జన్మించారు.కవలల దినోత్సవాన్ని వారు ప్రత్యేకంగా భావించి ఆనందంగా జరుపుకుంటున్నామన్నారువర్షిని, వర్ధిని ఒకే రూపంలో ఉండటమే కాదు ఒకే రకమైన హావభావాలను కలిగి ఉంటున్నారాన్నారు. ఇద్దరికీ ఒకేసారి ఆకలి అనారోగ్యం వస్తుంటాయని తల్లిదండ్రులు తెలిపారు. ఒకరికి జ్వరం వచ్చినచో మరొకరికి కూడా ఆ వెంటనే జ్వరం వస్తుందన్నారు.చదువులలోనూ రాణించి వారి ప్రతిభ కనబరుస్తూ వస్తున్నారు.పదవ తరగతి పరీక్షలలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై ప్రస్తుతం షిరిడి సాయి విద్యాలయం ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. అనుకున్న లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో మంచి ప్రయోజకులు కాగలరని ఆశిస్తూ కవలలందరికీ హ్యాపీ ట్విన్స్ డే శుభాకాంక్షలు తెలియజేద్దాం.

### ఆయుష్మాన్ భవ ఆరోగ్య మందిరానికి

# శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం, నరేంద్రపురం గ్రామంలో సుమారు రూ.36 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనానికి పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, అలాగే ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధిలో భాగంగా ఆరోగ్య రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ముందుండి నడిపిస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల నిర్మాణం ఎంతో కీలకమని, ఇవి ప్రజారోగ్యాన్ని మరింత మెరుగుపరుస్తాయని అన్నారు. అదేవిధంగా పి.గన్నవరం నియోజకవర్గానికి మొత్తం 44 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు మంజూరు కావడం, వాటి నిర్మాణానికి సుమారు రూ.14 కోట్ల నిధులు కేటాయించబడినట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. ఈ ఆరోగ్య మందిరాలన్నీ త్వరలోనే పూర్తిచేసి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

### పవన్ అన్న ఆరోగ్య భరోసా మెడికల్ క్యాంపు

# ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం,ముంగండ గ్రామంలో నిర్వహించిన పవన్ అన్న ఆరోగ్య భరోసా మెడికల్ క్యాంపును పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి వర్యులు, జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ పేరు మీద పి. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ పవన్ అన్న ఆరోగ్య భరోసా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఆస్పత్రులకు వెళ్లలేని స్థితిలో ఉన్న పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉచిత వైద్య సేవలు పొందాలని ఎమ్మెల్యే కోరారు. ఈ మెడికల్ క్యాంపులో సాధారణ వైద్య పరీక్షలతో పాటు కళ్ల పరీక్షలు నిర్వహించామని, పరీక్ష అనంతరం అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోళ్లు కూడా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఇది పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. అలాగే ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకులు నారా లోకేష్. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ, పేద ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు.కూటమి నాయకుల సహకారంతో, కిమ్స్ వైద్య సంస్థ సౌజన్యంతో పవన్ అన్న ఆరోగ్య భరోసా మెడికల్ క్యాంపును ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ప్రతి గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ముందుకు తీసుకెళ్లాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సాయిప్రియ సేవా సమితి 186వ వారం అన్నదానం



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సాయిప్రియ సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం కేంద్రం పిఠాపురం పశువుల సంతలో అన్నదాతలైన రైతులకుగా నిరవధికంగా వారానికి ఒక రోజు చొప్పున శనివారం మధ్యాహ్నం పూట ఆంధ్రా అన్నపూర్ణ డొక్కా సీతమ్మ గుర్తుగా డొక్కా సీతమ్మ అన్నపానీయ సదుపాయ కేంద్రం పేరుతో నిర్వహిస్తున్న అన్నదానం ఈ శనివారంతో 186 వ వారానికి చేరుకుంది. అన్ని దానాల కన్న అన్నదానం మిన్న అన్న లోకోక్తి అనుసారం దేశానికి వెన్నెముకైన అన్నదాతకు పెట్టెడు అన్నం పెట్టి వారిని ఆదుకుంటే అదే మహా భాగ్యమని భావించిన కాకినాడ జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాస్ తలంచారు. గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన శ్రీనివాస్ స్థానికంగా 2010లో సాయిప్రియ సేవా సమితిని స్థాపించి, దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా కొనసాగుతూ శంఖవరం మండలం కత్తిపూడి కేంద్రంగా సాయిప్రియ సేవా సమితి ద్వారా వివిధ ప్రజాభివృద్ధి, సంక్షేమ, అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాలను 16 ఏళ్ళుగా నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణ డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం పేరుతో వరుసగా మూడున్నర ఏళ్ళుగా పిఠాపురం పట్టణంలో పశువుల సంత కేంద్రంగా రైతులు, పశువుల బేరగాళ్ళు, మధ్యవర్తులు, స్థానిక వివిధ ఆస్పత్రులకు వచ్చే దూర ప్రాంతాల రోగులకూ ప్రతీ శనివారం మధ్యాహ్నం అన్నదానాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. ఈ అన్నదానం ఈ శనివారంతో 186 వ వారానికి చేరుకుంది. దీనిని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సేవా స్ఫూర్తితో నిర్వహిస్తున్నారు. నేటి మధ్యాహ్నం రైతులకు, పశువుల బేరాల మధ్యవర్తులకు, వివిధ ఆస్పత్రులకు వచ్చిన ఔట్ పేషెంట్లకు కలిపి 600 మందికి అన్నదానం చేశారు. ఆహార పదార్థాలు వడ్డనలో స్వచ్ఛందంగా సేవలను అందించిన కోలా నాని, సఖినాల లచ్చబాబు, జ్యోతుల నాని, విప్పర్తి శ్రీనులను సాయిప్రియ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు అభినందించారు. తమ ఈ సేవలను పిఠాపురం పశువుల సంతకు వచ్చే రైతులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని శంఖవరం మండలం కత్తిపూడిలోని సాయిప్రియా సేవా సమితి ప్రధాన కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది.

### ఒకటవ తరగతిలో 25 శాతం ఉచిత సీట్లకు

# మార్చి 10 లోపు దరఖాస్తు చేసుకోవాలి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం ప్రభుత్వేతర పాఠశాలల్లో 1 వ తరగతిలో 25 శాతం ఉచిత సీట్ల కోటాలో ప్రవేశాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 5 న ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 20 నుంచి మార్చి 10 వరకు విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఈ 25 శాతం సీట్లలో కూడా.. ఎస్సీలు 10, ఎస్టీలు 4, బీసీ మైనారిటీ ఇతరులకు 6 శాతం సీట్లు కేటాయిస్తారు. అనాథలు, హెచ్ఐవీ బాధిత చిన్నారులు 5 సీట్లు కేటాయిస్తారు. ప్రభుత్వ వెబ్‌సైట్, గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో ఆఫీసుల్లో దరఖాస్తులు సమర్పించవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు ఉండాలి. అదే పట్టణ ప్రాంతాల్లో తల్లిదండ్రులకు రూ.1.44 లక్షల వార్షిక ఆదాయం మించకూడదు. 2 జూన్ 2020 నుంచి మే 31 2021 మధ్య జన్మించిన విద్యార్థులు స్టేట్ సిలబస్ పాఠశాలల్లో చేరొచ్చు. 2 ఏప్రిల్ 2020 నుంచి 31 మార్చి 2021 మధ్య జన్మించిన వారు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ పాఠశాల్లో చేరేందుకు అర్హులు. విద్యార్థులకు ఐదేళ్ల వయసు నిండాలి. అర్హులైన విద్యార్థులు.. జనన (బర్త్), కుల (క్యాస్ట్), వార్షిక ఆదాయ (ఇన్‌కమ్) సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది. మరిన్ని టాప్ ఏవైనా అనుమానాలు ఉంటే ఈ నంబర్‌కు కాల్ చేస్తే వివరాలు చెబుతారు. విద్యార్థులు http://cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. అలాగే మీ-సేవ, ఎంఈవో కార్యాలయాల్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థుల చిరునామా ధ్రువీకరణకు విద్యార్థుల తెల్ల రేషన్ కార్డు, కరెంట్ బిల్లు, గ్యాస్ కనెక్షన్, ఓటరు గుర్తింపు కార్డు, ఉపాధి హామీ జాబ్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లను తీసుకుంటారు. మార్చి 25 న లాటరీ విధానంలో విద్యార్థుల్ని ఎంపిక చేస్తారు. ఏప్రిల్ 13 నుంచి 23 వరకూ విద్యార్థి తల్లిదండ్రులకు బదుల్లో ప్రవేశాలకు సంబంధించిన సమాచారం పంపుతారు. అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ లాటరీలో సీటు వచ్చిన తర్వాత ఎవరైనా విద్యార్థిని చేర్చుకోక పోయినా, ఇబ్బంది పెట్టినా అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు. ఈ ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్‌లో సీటు పొందిన విద్యార్థుల తరపున ప్రభుత్వం ఫీజ్ చెల్లిస్తుంది. 25న మొదటి విడత సీట్ల కేటాయిస్తారు. మార్చి 6 నుంచి ఏప్రిల్ 7 వరకు ప్రవేశాల ధ్రువీకరణ. ఏప్రిల్ 12న రెండో విడత సీట్ల కేటాయింపు. ఏప్రిల్ 13 నుంచి 23 వరకు పాఠశాలల ద్వారా విద్యార్థుల ప్రవేశాల ధ్రువీకరణ' ఉంటుంది. ఈ మేరకు కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం విద్యాశాఖ అధికారి సూరిశెట్టి వెంకట రమణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రైవేట్ పాఠశాలలకు 5 కిలో మీటర్ల లోపు దూరంలోని అర్హత ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# శంఖవరం కస్తూర్బాగాంధీకి ఇంటర్ పరీక్షా కేంద్రం మంజూరు

**పరీక్షా కేంద్రంలో సిసి కెమారాల ఏర్పాటు - పరీక్షా కేంద్రం ప్రాంతంలో 144 సెక్షన్ అమలు**
**పరీక్షా కేంద్రం చుట్టూ నో సెల్ ఫోన్ జోన్ ప్రకటితం - పకడ్బందీ ఏర్పాట్లు పూర్తిచేసిన చీఫ్ సూపరింటెండెంట్**



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని కస్తూర్బా గాంధీ బాలికా జూనియర్ కళాశాలకు ఈ ఏడాది కొత్తగా ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం మంజూరైంది. ఈ కేంద్రానికీ 07066 సంఖ్యను, 277మంది పరీక్షార్థులను కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,537 ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా అందులో ఒకటిగా శంఖవరం కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల కొత్తగా చేరి ఓ సరికొత్త గుర్తింపును సొంతం చేసుకున్నది. ఇంటర్మీడియట్ విద్యా మండలి ఉత్తర్వుల ప్రకారం ఈ కొత్త పరీక్షా కేంద్రంలో ఈ కస్తూర్బా జూనియర్ కళాశాల విద్యార్థినిలతో పాటు తుని నియోజకవర్గం తొండంగి మండలం అద్దరిపేటలోని కస్తూర్బా గాంధీ బాలికా జూనియర్ కళాశాల, ఒంటిమామిడిలోని త్రిపుర జూనియర్ కళాశాల, శంఖవరం మండలం అన్నవరంలోని శ్రీ సత్యదేవ జూనియర్ కళాశాల, కత్తిపూడిలోని శ్రీ సీతారామా జూనియర్ కళాశాల, శ్రీనిధి కళాశాల, శంఖవరంలోని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ జూనియర్ కళాశాలకు చెందిన మొత్తం 277 మంది విద్యార్థులు పరీక్షలను రాయనున్నారు. ఈ పరీక్షా కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంటుగా శంఖవరం కస్తూర్బా బాలికా విద్యాలయ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బీరా బాలామణి కుమారి వ్యవహరించ నున్నారు. ఈ కేంద్రానికి హాజరయ్యే 277 మంది పరీక్షార్థుల పరీక్షలు సున్నితంగా జరగడానికి శంఖవరం మండల విద్యాశాఖాధికారి సూరిశెట్టి వెంకట రమణ సహకారంతో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బీరా బాలామణి కుమారి, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ సూరిబాబు సంయుక్తంగా అన్ని ఏర్పాట్లనూ పూర్తి చేసారు. ఈ నూతన వార్షిక పరీక్షా కేంద్రంలోని పరీక్షలను పకడ్బందీగా పర్యవేక్షించేందుకు సిసి కెమారాలను ఏర్పాటు చేసి, వాటిని విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ప్రాంగణంలోని రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యామండలి కార్యాలయానికి అనుసంధానం చేసారు. ఈ పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాన్ని నో సెల్ ఫోన్ జోన్ గా ప్రకటించడంతో పాటు 144 సెక్షన్ని కూడా విధించారు. పరీక్షల పర్యవేక్షణకు ఇన్విజిలేటర్లను, పటిష్టమైన భద్రతకు పోలీసులనూ నియమించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం 23 తేదీ నుంచి మార్చి 24 వరకూ ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా తమ శంఖవరం శంఖవరం కస్తూర్బా గాంధీ బాలికా జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలోని పరీక్షలను కూడా పగడ్బందీగా పటిష్టంగా నిర్వహించేలా ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలూ తీసుకుని ఏర్పాట్లన్నీ పూర్తి చేసామని పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బీరా బాలామణి కుమారి మీడియాకు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షార్థుల రాక ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రంలోనికి అనుమతించబోమని, పరీక్షా కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది వరకూ స్థానికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాల జూనియర్ కళాశాల, అలాగే అన్నవరంలోని దేవస్థానం జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక పరీక్షల నిర్వహణ కేంద్రాలను కొనసాగించారు. ఐతే ఈ విద్యా సంవత్సరంలో పరీక్షా కేంద్రాలు మాకు వద్దని ఈ రెండు విద్యా సంస్థలూ ఇంటర్మీడియట్ విద్యామండలికి నివేదించాయి. కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాలకు అధునాతన భవనం సమకూరడం, అన్ని సౌకర్యాలు ఉండటం, ఏ మరుగూ లేకుండా రహదారి పక్కనే ఉండటం వల్ల ఇక్కడికి కొత్తగా ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం మంజూరుకు మార్గం సుగమం అయ్యింది. బాలామణి కుమారికి చీఫ్ సూపరింటెండెంట్ హోదాలో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని నిర్వహించడం మొదటి సారిగా అనుభవంలోకి రావడం ఒక ఎత్తు అయితే, ఈ కొత్త అవకాశాన్ని ఓ సవాలుగా తీసుకుని విజయవంతంగా నిర్వహించి ప్రభుత్వ మన్ననలు పొందడం మరొక ఎత్తు కాగలదు.

# పరారైన 8 గంటల్లో బాలికను ఛేదించారు..!



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** తమ కుమార్తె కనిపించకుండా పోయిందని తల్లి, తండ్రులు ఫిర్యాదు చేసిన 8 గంటల్లోనే ఆ బాలికను ఛేదించి తల్లి తండ్రులకు అప్పగించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు పోలీసులు. శుక్రవారం రాత్రి 9.30 గంటలకు ప్రత్తిపాడు గ్రామానికి చెందిన 17 ఏళ్ళ బాలిక ఇంటి నుండి ఎక్కడికో వెళ్ళిపోయిందని, ఇంకా తిరిగి రాలేదని, ఎక్కడా కనబడట్లేదని బాలిక తల్లిదండ్రులు ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసారు. దీంతో బాలికది పరారీ కేసుగా ప్రత్తిపాడుఎస్సై లక్ష్మీకాంతం నమోదు చేసి, ప్రత్తిపాడు సిఐ. బి.సూర్య అప్పారావు పర్యవేక్షణలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, ప్రత్యేక గాలింపు చర్యలు చేపట్టారు. అత్యాధునిక సాంకేతికత పరిజ్ఞానంతో కేవలం 8 గంటల వ్యవధిలోనే బాలిక ఆచూకిని గుర్తించి, ఆమెను క్షేమమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో ఆ తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మికాంతంను, ఆమె సిబ్బందిని పలువురు అభినందించారు.


# రాహుల్ గాంధీ దిష్టి బొమ్మతో బీజేపీ నిరసన



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఇండియా ఎఐ ఎక్స్‌పోలో నిన్న కాంగ్రెస్ గుండాలు భారతమండపంపై దాడి చేసి భారత ప్రధాని నరేంద్ర మోడీని అవమానపరిచారు అని నిరసిస్తూ, నందం గనిరాజు జంక్షన్ వద్ద బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టి బొమ్మతో నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేతిరెడ్డి ఆదిత్య మాట్లాడుతూ ఏదైతే నిన్న కాంగ్రెస్ యువజన విభాగానికి చెందిన వ్యక్తులు ఎఐ సమీట్లో అర్థ నగ్న ప్రదర్శన దేశ గౌరవాన్ని కించపరిచేటట్లు ఉందని ఇలాంటి దేశ విద్రోహ కార్యక్రమాలు కాంగ్రెస్ నిర్వహించడం వల్లే కాంగ్రెస్ దేశంలో అన్ని చోట్ల నుంచి తుడిచిపెట్టుకుపోయింది అని మిగిలిన ఒకటి రెండు చోట్ల నుంచి కూడా త్వరలోనే తుడిచిపెట్టుకుపోతాదని కాంగ్రెస్ ముక్త భారత్ అన్న నినాదం నిజమవుతుందని దానికి ప్రజలే ముందుండి ఆ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తారని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, బిజెవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేతిరెడ్డి ఆదిత్య, ఒబిసి మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాలేపు సత్య సాయి, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఖండవల్లి సాయి, బిజెవైఎం నాయకులు పెరుమాళ్ళ పవన్, గంధ్రోతు పవన్, మజ్జి శివ, గోవింద్, కృష్ణ అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

### గ్రామీణ విద్యుత్ సమస్యలపై

# అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆనందరావు గళం



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను ప్రధానంగా ప్రస్తావిస్తూ అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గళం విప్పారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్పష్టంగా వివరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో విద్యుత్ రంగంలో తీసుకుంటున్న సంస్కరణలు, ధరల తగ్గింపు దిశగా జరుగుతున్న చర్యలు ప్రజలకు ఉపశమనం కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యుత్ రంగం బలోపేతం అవుతోందని అన్నారు. భవిష్యత్తులో విద్యుత్ భారం తగ్గేలా దీర్ఘకాల ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అవసరాన్ని ఆయన ప్రత్యేకంగా హైలైట్ చేశారు. అనేక గ్రామాల్లో లైన్‌మెన్ల కొరత తీవ్రంగా ఉందని, చిన్న చిన్న లోపాలు కూడా రోజులు గడిచినా సరిచేయలేని పరిస్థితి నెలకొంటోందని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాలు ఎక్కువసేపు కొనసాగడం వల్ల రైతులు, చిన్న వ్యాపారులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. విద్యుత్ సిబ్బంది సంఖ్యను పెంచడం, ఖాళీ పోస్టులను భర్తీ చేయడం, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను బలోపేతం చేయడం అత్యవసరమని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి ఫీడర్ పరిధిలో బాధ్యతాయుతమైన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. ప్రజలకు సమయానుకూలంగా స్పందించే విధంగా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చాలని కోరారు. 2014లో అమలు చేసిన విధంగా 'విద్యుత్ వారోత్సవాలు' నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సమస్యలను సమగ్రంగా గుర్తించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారులు గ్రామాలకే వెళ్లి సమస్యలను నమోదు చేసి, అక్కడికక్కడే పరిష్కారానికి చర్యలు చేపట్టే విధానం పునరుద్ధరించాలన్నారు. దీని ద్వారా ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని, విద్యుత్ శాఖ పనితీరుపై సానుకూల ప్రభావం పడుతుందని తెలిపారు. గ్రామీణ విద్యుత్ సరఫరా కేవలం ఒక సేవ మాత్రమే కాకుండా వ్యవసాయం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, విద్య, ఆరోగ్యం వంటి అనేక రంగాల అభివృద్ధికి ఆధారం అని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా సాగు నీటి పంపుల నిర్వహణకు నిరంతర విద్యుత్ అవసరమని, తరచు అంతరాయాలు పంటలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రజల సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రస్తావిస్తూ నిర్మాణాత్మక సూచనలు చేయడం ద్వారా గ్రామీణ విద్యుత్ సమస్యలపై స్పష్టమైన చర్చకు దారి తీసినట్లు భావిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సేవలను మెరుగుపరచే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. గ్రామీణ ప్రజల విద్యుత్ సమస్యలే ప్రాధాన్యంగా భావిస్తూ వాటి పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన లేవనెత్తిన అంశాలపై ప్రభుత్వం త్వరితగతిన స్పందించి, స్థిరమైన చర్యలు చేపడితే గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ పరిస్థితి గణనీయంగా మెరుగుపడే అవకాశం ఉందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

### కొడమంచిలి శివని అభినందించిన

# ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ



**పి.గన్నవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పి.గన్నవరం మండలం లంకల గన్నవరం గ్రామానికి చెందిన కొడమంచిలి శివ అమరావతిలో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు గోల్డ్ మెడల్ రెండు సిల్వర్ మెడల్ ఒకటి బ్రౌన్ మెడల్ సాధించిన సందర్భంగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ వారి క్యాంపు కార్యాలయంలో దుస్సాల్వతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పథకాలు సాధించాలని ఏమి అవసరం వచ్చినా సహకరిస్తానని శివకి హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ఎండి రిజ్వీ. చిల్లే రమేష్. కొడమంచిలి మల్లేష్. గిడ్డి వెంకటేశ్వర రావు. కొమ్ముల జంగమయ్య. వెంకట్. సురేష్. బొర్ర సురేష్. లక్ష్మణ్. గన్మెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అగ్నికి అహుతైన కారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలమూరు మండలం మడికి 216వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన అగ్ని ప్రమాదంలో కారు దగ్ధమైనట్లు స్థానికులు తెలిపారు. వారు వివరాలు ప్రకారం రావులపాలెం వైపు నుండి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న కారు ఇంజన్లో వైరింగ్ కిట్ లో సాంకేతిక లోపం ఏర్పడటంతో ఒక్కసారిగా మంటలు కారును వ్యాపించాయి. క్షణాల్లో కాదు బూడిదయ్యింది. అయితే కారులో ఒకరు మాత్రమే ఉన్నట్లు స్థానికులు తెలిపారు.కారు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందినదిగా అనుమానం వ్యక్తం దీనిపై వివరాలు తెలియవలసి ఉంది.

### స్వచ్ఛ ఆసుపత్రులతో ప్రజారోగ్యానికి

# బాసటగా కూటమి ప్రభుత్వం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆసుపత్రి వ్యర్థాల నిర్వహణ పక్కాగా ఉండాలి కొత్తపేట ప్రభుత్వాసుపత్రిని పరిశీలించిన ఎమ్మెల్యే బండారు పారిశుధ్య కార్మికులు, రోగులతో మాట్లాడి ఆసుపత్రి స్వచ్ఛతపై వివరాలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే పరిశుభ్రమైన, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, ప్రభుత్వాసుపత్రుల్లో వ్యర్థాల నిర్వహణ పక్కాగా జరగాలని బండారు సూచించారు. ఆయన కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి ఆసుపత్రిలో వ్యర్థాల నిర్వహణ విధానాలను అక్కడ విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికులను, సిబ్బందిని నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలను స్వచ్ఛంగా ఉంచాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణ ఏ విధంగా జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. బయోమెడికల్ వ్యర్థాల ట్రాకింగ్‌కి సంబంధించిన బార్ కోడ్ ఆధారిత సిస్టమ్ ని పరిశీలించారు.రోగులతో మాట్లాడి ఆసుపత్రిలోని శుభ్రత ప్రమాణాలపై ఆరా తీశారు. వారంతా ఎమ్మెల్యే వద్ద ఆసుపత్రి పరిశుభ్రతపై సంతృప్త వ్యక్తం చేసారు.

# స్వచ్ఛతే సేవ లక్ష్యంగా స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

స్వచ్ఛతే సేవ ఆరోగ్యమే మహాభాగ్యం అనే ప్రధాన ధ్యేయంతో నిర్వహిస్తున్న స్వచ్ఛ్ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని ఆర్డీవో కే.మాధవి పేర్కొన్నారు. శనివారం పట్టణ పరిధిలోని వెచ్చవారి అగ్రహారంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, స్థానికులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంచడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, తడి-పొడి చెత్తను వేరు చేయడం, ప్రజల్లో శుభ్రతపై అవగాహన పెంచడం వంటి లక్ష్యాలతో ప్రతి నెల మూడో శనివారం సామూహిక శ్రమదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల్లో పరిశుభ్రత, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలకు అనుగుణంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం మార్గదర్శకత్వంలో అన్ని మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు, వాలంటీర్ల సహకారంతో ప్రత్యేక ప్రోగ్రాములు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. చెత్తను సక్రమంగా తొలగించడం, పరిశుభ్రతా నియమాలు పాటించడం ద్వారా స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి రాష్ట్రాన్ని పరిశుభ్రమైన, అభివృద్ధి చెందిన అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. 'స్వర్ణాంధ్ర ఏ2047' దార్శనికతతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పర్యావరణ కాలుష్యాన్ని నివారించడం, ముఖ్యంగా జల కాలుష్యాన్ని అరికట్టడం అత్యంత అవసరమని, పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటానికి అందరూ కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె అన్నారు. ప్రతి నెల ఒక్కో థీమ్‌ను ఎంపిక చేసి కార్యక్రమాలను స్ఫూర్తిదాయకంగా నిర్వహిస్తున్నామని, ఈసారి 'ఈ-వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో డిస్పోజల్ చేయడం (చెత్త రహిత పరిపాలన)' అనే ఇతివృత్తంతో కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్ర మణి, తహసీల్దార్ వాస దివాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం బొబ్బర్లంక ముక్కామల ప్రధాన పంట కాలువలో లభ్యం స్థానిక రావులపాలెం పోలీస్ స్టేషన్ టౌన్ ఎస్సై కేవీ రమణారెడ్డి కథనం ప్రకారం రావులపాడు నందు గల వినాయకుడి సమీపంలో బొబ్బర్లంక ముక్కామల ప్రధాన పంట కాలువలో సుమారు 50 నుంచి 55 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని మగసేవము ఉన్నట్లు స్థానిక వీఆర్వో ఇచ్చిన రిపోర్టుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు సదరు మృతుని వివరాలు మృతుడు ఎత్తు సుమారు 5 అడుగుల 6 అంగుళాలు బక్క పలుచగానుఉండి గడ్డం జుట్టు మెరిసి ఉన్నది మృతుని. ఎగువ ప్రదేశం నుండి కొట్టుకు వచ్చినట్లు అనుమానము. మృతుని వివరాలు ఎవరికైనా తెలిసిన యెడల రావులపాలెం పోలీస్ స్టేషన్ నందు సంప్రదించాలని రావులపాలెం ఎస్సై కెవి రమణ రెడ్డి తెలిపారు మృతుని గుర్తుపట్టుటకు గాను మృతదేహమును స్థానిక కొత్తపేట ప్రభుత్వాసుపత్రి మార్చురీ షెడ్ నందు భద్రపరిచినట్లు తెలిపారు.

# దేవుడితో వైసీపీ నీచ రాజకీయం

**నాడు చెప్పులతో జగన్ మాఢ వీధుల్లో తిరిగారు - నేడు బూట్లు వేసుకుని సభకు వేంకటేశ్వరుని చిత్రపటాలతో చేష్టలు**
**జగన్‌కి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి లేదు, భయం లేదు - వైసీపీ హయంలో 300కు పైగా దేవాలయాలపై దాడులు, ధ్వంసం**
**శ్రీవారి లడ్డూలో కల్తీ, హిందువుల మనోభావాలంటే వైసీపీకి లెక్కలేదు**
**శాసనమండలిలో వైసీపీ సభ్యుల తీరుపై ఘాటుగా స్పందించిన ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఫొటోలను చెప్పులు, షూలు వేసుకుని నినాదాలు చేస్తూ రాజకీయం చేసే నీచానికి వైసిపి వాళ్ళు దిగజారారని రాజమహేంద్రవరం గ్రామీణ శాసన సభ్యులు, టిడిపి సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. ఇదంతా జగన్మోహన్ రెడ్డి ఒక పథకం ప్రకారం డైరెక్షన్ లోనే జరిగిందని ఆయన పేర్కొన్నారు. శాసన మండలిలో వైసిపి సభ్యుల చేష్టలపై ఎమ్మెల్యే గోరంట్ల ఘాటుగా స్పందిస్తూ, ఒక ప్రకటన విడుదల చేసారు. జగన్ మోహన్ రెడ్డికి, వైసీపీ నేతలకు దేవుడంటే భక్తి లేదు, భయం లేదు. హిందువుల మనోభావాలంటే లెక్కలేదని ఆయన వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడు చట్టసభలను బూతులు, వెకిలివేషాల కేంద్రాలుగా మార్చారని, ఇప్పుడు ఏకంగా దేవుడి ఫొటోలతో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే గోరంట్ల విమర్శించారు. హిందూమత విశ్వాసాల పట్ల, తిరుమల తిరుపతి దేవస్థానం సంప్రదాయాలు, సంస్కృతి పట్ల జగన్మోహన్ రెడ్డికి ముందు నుంచీ చిన్నచూపు ఉందని ఆయన పేర్కొన్నారు. పరమపవిత్రమైన దేవుడి ప్రసాదాన్ని జంతు కొవ్వు, ప్రమాదకర రసాయనాలతో కల్తీ చేసారని, శ్రీవారి పరకామణిలో విదేశీ కరెన్సీని కొల్లగొట్టిన కేసులో నిందితుడైన రవికుమార్ తో రాజీ చేసుకుని అతని ఆస్తులను టీటీడీ పేరిట రాయించి దొంగలకు పెద్దన్న లాగా జగన్ రెడ్డి నిలిచాడని ఆయన విమర్శించారు. శ్రీవారి ఆలయంలో శ్రీవారి నామస్మరణ తప్ప మారేది వినిపించదని, అలాంటి పవిత్ర ప్రదేశంలో జగన్మోహన్ రెడ్డి పిన్నిచేత 'జగన్ రెడ్డి రక్షక గోవింద' అని పొగిడించుకుని శ్రీవారిని అవమానించి కోట్లాదిమంది హిందూ భక్తుల మనోభావాలు దెబ్బతీశారని ఎమ్మెల్యే గోరంట్ల ధ్వజమెత్తారు. తిరుమల మాడవీధుల్లో చెప్పులతో తిరిగిన జగన్మోహన్ రెడ్డి స్వామివారి పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని చాటుకున్నాడని ఆయన విమర్శించారు. వీఐపీ బ్రేక్, సేవా టిక్కెట్లు అమ్ముకున్నారు..సేవా టిక్కెట్లు, దర్శన టిక్కెట్లు, ప్రసాదాలు అన్నింటిలోనూ బ్లాక్ మార్కెట్ నడిపి కోట్లు దండుకున్నారని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. చివరకు రూ.2 కోట్లవిలువైన తలనీలాలను మొదట మయన్మార్, అక్కడి నుంచి థాయ్ ల్యాండ్ మీదుగా చైనాకు అక్రమంగా తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పట్టుకోవడమే దీనికి ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. రామతీర్థంలో రాములవారి శిరస్సు ఖండన చేయడం వంటి దాష్టీకానికి ఒడిగట్టారని, ఇలా ఒకటికాదు,రెండు కాదని, వందలాది దాడులు హిందూదేవాలయాలపై జగన్ పాలనలో పదేపదే ప్రతిరోజు జరుగుతుండేవని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. దోషులను శిక్షించకుండా హిందువులకు మనోధైర్యం ఇవ్వకుండా, ఈ ఘటనలు ఖండిస్తున్నామని కూడా చెప్పకుండా ఐదేళ్లు జగన్ రెడ్డి హిందూ వ్యతిరేక విధానాలు కొనసాగించాడని ఆయన ఎద్దేవా చేసారు. వైసీపీ హయంలో 300కు పైగా దేవాలయాలపై దాడులు, విగ్రహాల ధ్వంసం ఘటనలు జరిగితే, ముఖ్యమంత్రిగా ఒక్కరోజు కూడా వెళ్లి జగన్మోహన్ రెడ్డి పరిశీలించలేదని ఆయన వాపోయారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని స్వామివారికి సతీసమేతంగా పట్టువస్త్రాలు సమర్పించాల్సి ఉంటె, జగన్మోహన్ రెడ్డి మాత్రం ఏ రోజు సతీసమేతంగా పట్టువస్త్రాలు ఇవ్వకుండా హిందూ సంప్రదాయాలను కాలరాయడం తెల్సిందేనని ఎమ్మెల్యే గోరంట్ల ప్రస్తావించారు, అన్యమతస్థుడైన జగన్ రెడ్డి.. ఎలాంటి డిక్లరేషన్ ఇవ్వకుండా తిరుమల పర్యటించడం, స్వామి వారికి తాను ఒక్కడే పట్టువస్త్రాలు సమర్పించడంపై పండితులు, మేధావులు అభ్యంతరంవ్యక్తం చేసినా జగన్ రెడ్డి ఏ రోజు ఖాతరు లేదని ఆయన గుర్తుచేశారు. దేవాలయాల భూములపై, మాన్సాస్ ట్రస్ట్ ఆస్తులపై, టీటీడీ ఆస్తుల అమ్మకంపై ఉన్న శ్రద్ధదేవాలయాల పరిరక్షణపై జగన్మోహన్ రెడ్డికి లేదని ఆయన పేర్కొన్నారు. అనేక ఘటనల ద్వారా తిరుమల పవిత్రతను దెబ్బతీశాయని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో బలవంతపు మత మార్పిడులు నిత్యకృత్యంగా మార్చాడని, రాష్ట్రంలో 2500 దేవాలయాల ట్రస్ట్ లను నిర్వీర్యం చేసి హిందూమతంపై దాడి చేసిన పాపాత్ముడు జగన్ రెడ్డి అని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. ఈవిధంగా దేవదేవుడితో ఆటలు ఆడడం వలన 11 సీట్లకు పడిపోయాడని ఎమ్మెల్యే గోరంట్ల పేర్కొన్నారు. అయినా సిగ్గు, బుద్ధి రాలేదని, చేసిన తప్పులు ఇప్పటికైనా ఒప్పుకుని దేవుడిని క్షమాపణ వేడుకోకపోతే, భవిష్యత్తులో 11సీట్లు కూడా రావని ఆయన పేర్కొన్నారు.

## కోరుకొండ నరసన్న హుండీ ఆదాయం 4.98 లక్షలు

**- డిప్యూటీ కమిషనర్ బాబురావు - కొబ్బరి చెక్కల పాట 1.95 వేలు**



**కోరుకొండ, విశ్వం వాయస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి హుండీల ఆదాయం 4.98 లక్షల రూపాయలు వచ్చిందని అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్ బాబురావు తెలిపారు. శనివారం నరసన్న కొండ పైన, క్రింద ఉన్న తొమ్మిది హుండీలను అన్నవరం దేవస్థాన అధికారుల ఆధ్వర్యంలో లెక్కించమన్నారు. గత ఏడాది మార్చి నుండి ఈ ఏడాది ఫిబ్రవరి నరసన్నకు ఈ ఆదాయం సమకూరిందన్నారు. త్వరలో జరగనున్న నరసన్న కళ్యాణ మహోత్సవాల్లో భాగంగా కొబ్బరి చెక్కల పాట 1.95 లక్షలకి వెళ్లిందని, గత ఏడాది కంటే ఈ ఏడాది 60 వేల రూపాయలు ఎక్కువ వచ్చిందన్నారు. పాదరక్షల పాట 73 వేల రూపాయలకు వెళ్లిందని,గత ఏడాది కంటే 24,500 రూపాయలు ఆదాయం అదనంగా వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్పి రంగరాజ బట్టర్, అన్నవరం దేవస్థానం అధికారులు డిసి బాబురావు, ఏఈఓ అనకాపల్లి ప్రసాద్, సూపర్డెంట్ తాడి గుర్రాజు, ఎస్ టి బి శ్రీనివాస్ ఆచార్యులు, శ్రీనివాస్,రాంజీ, రమణ, నరసన్న దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వంగలపూడిలో వైసీపీ పంచాయితీ వైస్ ప్రెసిడెంట్ ఫణిబాబు టీడీపీలో చేరిక



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం వంగలపూడి గ్రామానికి చెందిన పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కాంద్రేగుల ఫణిబాబు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి రుడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మరియు రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. సీతానగరం గ్రామ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గెడ్డం తిమ్మయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల సమక్షంలో కాంద్రేగుల ఫణిబాబును పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఫణిబాబు చేరికతో వంగలపూడి గ్రామంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.ఫణిబాబు మాట్లాడుతూ అభివృద్ధి మరియు ప్రజాసేవే తన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి గ్రామ పార్టీ ప్రెసిడెంట్ గద్దె నాని, వైస్ ప్రెసిడెంట్ కొరవటి గోపి, నాయకులు గద్దె శ్రీను, సింగవరం సర్పంచ్ సంగాన చిన పోసియ్య, నీరుకొండ శివ, పెండ్యాల అవిసైన్ బాబు , మద్దిపాటి సుజీరాజు , సింహాద్రి వీర్రాజు చౌదరి, పుక్కాల శ్రీనివాస్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.ఫణిబాబు మాట్లాడుతూ, అభివృద్ధి మరియు ప్రజాసేవే తన లక్ష్యమని, తెలుగుదేశం పార్టీ ఆశయాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## నరసన్న రథోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ వై.శ్రీకాంత్

**- సీసీ కెమెరా ఏర్పాటుకు పరిశీలన**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాలు ఈనెల 27వ తేదీ నుండి మార్చి నాలుగో తేదీ వరకు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. శనివారం రాజమహేంద్రవరం ఉత్తర మండల డిఎస్పి వై శ్రీకాంత్ ఆధ్వర్యంలో రథోత్సవ ఏర్పాట్లు ముందస్తు చర్యల్లో భాగంగా రథం రోడ్డు, కొండ పైన క్రింద పనులను పరిశీలించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్వీవిఎస్ మూర్తి, ఎస్సై శ్రీనివాస్ కి వివరించారు. అదేవిధంగా సిసి కెమెరాలు ఏర్పాటు పైన, కొండ ప్రాంగణమంతా క్షుణంగా పరిశీలించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, ఆలయ సిబ్బందితో చర్చించి, గత లోటుపాట్లు పునరావృతం కాకుండా రథోత్సవం, కళ్యాణ మహోత్సవాలలో పగడ్బందీ చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, సర్పంచ్ కర్రి లక్ష్మిసరోజ గణేష్, సుంకర శ్రీను, నరసన్న ఆలయ సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్తలో వేరు చేయడం

## బాధ్యతగా భావించండి

**చైర్ పర్సన్ రాణి**




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పట్టణం లోని అన్ని వార్డుల్లో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ తడి పొడి చెత్తను వేరువేరు చేయడం బాధ్యతగా భావించాలని చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం మండపేట పురపాలక సంఘ కార్యాలయం వద్ద మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. ఈ-వేస్ట్ కలెక్షన్ స్వచ్ఛత ర్యాలీ నిర్వహించారు. పతివాడ నూక దుర్గారాణి మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేదించాలని పేర్కొన్నారు . ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వంటి అనారోగ్య సమస్యలతో పాటు పర్యావరణం కూడా పూర్తిగా దెబ్బ తింటుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని కోరారు.మెయిన్ రోడ్డు, టౌన్ హాల్ రోడ్డు మీదుగా ఈ-వేస్ట్ కలెక్షన్ చేపట్టారు. ప్లాస్టిక్ నిషేదించాలని తడిపొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలనే నినాదాలతో ర్యాలీ చేశారు.27వ వార్డు కౌన్సిలర్ నీలం దుర్గ, బిజెపి సీనియర్ నాయకులు కోన సత్యనారాయణ , ఇన్ ఛార్జ్ కమీషనర్ డిప్యూటీ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్ , శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు మెప్మా ఆర్.పి లు, మున్సిపల్ సిబ్బంది స్వర్ణ వార్డు సచివాలయ సెక్రటరీలు మేనేజర్లు వి. శ్రీనివాసరావు, దంటు శ్రీనివాస్ , అసిస్టెంట్ ఇంజనీర్లు డి. పవన్ కుమార్, ఆర్. అనుష లక్ష్మి, మెప్మా సిఎంఎం పి.సుజాత, సిఓలు రాంజీ ఆర్.పిలు, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీలకు

## ఆశ్రమ్ పాఠశాల విద్యార్థులు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం ఆర్.సి.యం చర్చ్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి కరాటే టైక్వాండో పోటీలకు మండపేట ఆశ్రమ్ స్కూల్ విద్యార్థులు ఎం.పరిమిల, ఆర్.ప్రసన్న, డి.వైష్ణవి, వి.వర్షిత్ టి.హేమ సాహిత్ కె తేజ రెడ్డి జి మీనాక్షి రెడ్డి ఎం కె ని సిహెచ్ నవ్య,కె కౌశిక్ నిహారిక, పి అఖిల, ఈ ఏ.బి.సి.డి.ఈ గ్రూపులలో టైక్వాండో కరాటే పోటీలకు ఎంపిక అయినట్లు స్కూల్ సీనియర్ మార్షల్ ఆర్ట్స్ కోచ్ టి అబ్బులు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను స్కూలు ప్రిన్సిపాల్ యాంద్ర భాస్కర పద్మావతి, వై.అవినాష్ టీచర్స్ అభినందించారు.

బెంగళూరులో వివాహ వేడుకకు

## హాజరైన వైఎస్ జగన్

**- ఏపీఐఐసీ మాజీ చైర్మన్ కుమారుడి పెళ్లి వేడుకలో పాల్గొనడం**
**- నూతన దంపతులకు ఆశీస్సులు, శుభాకాంక్షలు**



**బెంగళూరు, విశ్వంవాయిస్ న్యూస్ :** ఏపీఐఐసీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం కుమారుడి వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ హాజరయ్యారు. బెంగళూరులోని తిరుమేనహళ్ళి ప్రాంతంలోని ద లీలా భారతీయ సిటీలో ఈ వివాహ వేడుక జరిగింది. ఈ సందర్భంగా నూతన వధూవరులు నాగ ఉమా యజ్ఞిత, యశ్వంత్‌లకు వైయస్ జగన్ వివాహ శుభాకాంక్షలు తెలిపారు. సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆశీర్వదించారు. వివాహ వేడుకకు పలువురు రాజకీయ నాయకులు, కుటుంబ సభ్యులు, ఆహ్వానితులు హాజరయ్యారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.

వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావాలనే

## నినాదంతో వైసిపి పాదయాత్ర

**మండపేట నుండి తరలి వెళ్ళిన వైసీపీ నాయకులు**




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర వైసిపి ఇంటెలెక్చువల్ విభాగం కార్యదర్శి కొడమంచిలి హరీష్ ఆధ్వర్యంలో, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2029 ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ శనివారం రావులపాలెం లో ఆరంభించిన పాదయాత్ర లో మండపేట వైసిపి నాయకులు పాల్గొన్నారని వైసిపి నాయకులు కౌన్సిల్ మందపల్లి రవికుమార్ పేర్కొన్నారు. ఈ పాదయాత్ర రావులపాలెం నుంచి గుణదల మేరీ మాత కొండ వరకు భక్తి, సంకల్పంతో సాగుతుందన్నారు. మండపేట నియోజకవర్గం నుండి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేశారనీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో తెచ్చిన మార్పును గుర్తు చేస్తూ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు.ప్రజల ఆశీర్వాదంతో 2029లో తిరిగి వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు.వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందని పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మందపల్లి రవి కుమార్, యర్రగుంట అయ్యప్ప,కొడమంచిలి భాస్కరరావు, కోళ్ళ శ్రీనివాస్, మడికి ఆనందరావు, రామదాసు వీర్రాజు, అయినవిల్లి రమణ, దార్ల అబ్రహం, లక్ష్మణ్, లంక సాయి,సుందూరపు అవినాష్ పాల్గొన్నారు.

ఎల్ఐసి ఉద్యోగుల ఆధ్వర్యంలో

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎల్ఐసి ఒబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం రాజమండ్రి వారి ఆధ్వర్యంలో స్థానిక గణేష్‌చౌక్ వద్ద ఉన్న బిసి బాలికల వసతి గృహము నందు ఉన్నా ఇంటర్మీడియట్ విద్యార్థినులకు పరీక్షల నిమిత్తం మేటిరియల్‌ను ఎల్ఐసి ఉభయ గోదావరి జిల్లాల సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు చేతుల మీదగా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి ఒబిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు జనరల్ సెక్రటరీ ఎకె విశ్వనాథం, జాయింట్ సెక్రటరీలు ఎమ్.రమేష్ బాబు, డి.శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ నాయకులు రాజేందర్‌ప్రసాద్, కె.చిరంజీవి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యులు ఎ.నాగబాబు వసతి గృహము అధికారులు, బిసి నాయకులు పి.రామ్ కుమార్, రాజేష్ పాల్గొన్నారు. సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు విద్యార్థులకు పరిక్షలకు సంబంధించిన విషయాలను వెల్లడించి వారికి ధైర్యంగా పరిక్షలు ఎలా వ్రాయాలో సూచించారు.అలాగే రమేష్ బాబు విద్యార్థులకు పరిక్షలకు ఎలా చదవాలి అని వివరిస్తూ ఉన్నత స్థాయి ఉన్న కొందరి అధికారులు ఎలా చదవారో చెప్పడం జరిగింది. అలాగే జనరల్ సెక్రటరీ ఎకె విశ్వనాథం మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యార్థులు పైకి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం వై-జంక్షన్ వద్ద ఉన్న బిసి బాలుర వసతి గృహము నందు ఉన్నా ఇంటర్మీడియట్, పదవ తరగతి విద్యార్థులకు పరిక్షలకు ఉపయోగించే నోటు పుస్తకాలు ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహు చేతుల మీదుగా అందజేశారు. సత్యనారాయణ సాహు మాట్లాడుతూ విద్యార్థులకు పరిక్షలకు లెక్కలు ఎలా చేయాలో వివరించారు అలాగే మిగిలిన సబ్జెక్ట్‌లు ఎలా వ్రాయాలో సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఎకె విశ్వనాథం, ఎం.రమేష్ బాబు, డి.శ్రీనివాస్, రామ్ కుమార్, రాజేష్, టీబి రాజేందర్ ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, హాస్టల్లో ఉన్న అధికారులు ఉన్నారు.

## రిమ్మలపూడిని పరామర్శించిన బొడ్డు



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం తెలుగు యువత అధ్యక్షులు రిమ్మలపూడి చరణ్ అమ్మమ్మ ఇటీవల స్వర్గస్తులైనారు. శనివారం చరణ్ స్వగ్రామమైన దోసకాయలపల్లిలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి చరణ్ ను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మార్ని రాము, కంటే నాగకేశవరావు, సర్పంచ్ దారా యశోదమ్మ రాంబాబు,రాజేష్, చిట్టిప్రోలు పద్దరాజు, గడ్డం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# 11 సినిమాలు చేస్తే 9 ఫ్లాప్స్..!

## అయినా తగ్గని క్రేజ్, ఆఫర్స్..

వెండితెరపై ఇప్పుడు కొత్త అందాలు సందడి చేస్తున్నాయి. తొలి సినిమాతోనే బ్లాక్ బస్టర్ హిట్ ఖాతాలో వేసుకుని వరుస ప్రాజెక్ట్స్ అందుకుంటున్నారు. అలాంటి వారి జాబితాలో ఈ ముద్దుగుమ్మ కూడా ఒకరు. అందం, అభినయంతోనే కాకుండా.. లేడీ మైకేల్ జాక్సన్ అన్నట్లుగా డాన్స్?తోనే మైమరపిస్తోంది. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రస్తుతం కొత్త కొత్త హీరోయిన్స్ హవా నడుస్తోంది. సినిమా సినిమాకు కొత్త హీరోయిన్స్ సందడి చేస్తున్నారు. కొంతమంది ముద్దుగుమ్మ ఒకే ఒక్క సినిమాతో స్టార్ డమ్ తెచ్చుకుంటున్నారు. చాలా మంది ముద్దుగుమ్మలు ఇప్పుడు ఇండస్ట్రీలో ఊపేస్తున్నారు. వారిలో ఈ ముద్దుగుమ్మ ఒకరు. బ్యాక్ టూ బ్యాక్ సినిమాలు చేస్తూ టాలీవుడ్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్?గా దూసుకుపోతుంది. అయితే హిట్స్ మాత్రం అందుకోలేకపోతుంది. వరుసగా సినిమాలు చేసినా రెండే రెండు హిట్స్ అందుకుంది. కానీ ఆఫర్స్ మాత్రం తగ్గడంలేదు ఈ అమ్మడికి. ఆమె ఎవరో గుర్తుపట్టండి. ఆమె కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్. తెలుగులో క్రేజీ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకొని ఆతర్వాత బాలీవుడ్, అలాగే తమిళ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆమె ఎవరంటే.. యంగ్ హీరోయిన్ శ్రీలీల. 2001 జూన్ 14న జన్మించిన శ్రీలీల.. కర్ణాటకలోని బెంగుళూరులో పెరిగారు. 2019లో కిస్ సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత కన్నడలో భరతే చిత్రంలో కనిపించింది. అయితే 2021లో దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు పర్యవేక్షణలో తెరకెక్కిన పెళ్లి సందణ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైంది. తొలి సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల హృదయాలను దొచేసింది. ఇంకేముంది.. వరుస ఆఫర్స్ అందుకుంటూ ఫుల్ బిజీ అయ్యింది. తొలి సినిమా తర్వాత మాస్ మహారాజా రవితేజ సరసన ధమాకా చిత్రంలో నటించి బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ప్రస్తుతం ఈ అమ్మడు చేతిలో క్రేజీ ఆఫర్స్ ఉన్నాయి. ఈ సినిమా వరుసగా సినిమాలు చేసిన సక్సెస్ లు అందుకోలేకపోతుంది. తెలుగులో వరుసగా 11 సినిమాలు చేసినా హిట్స్ మాత్రం కేవలం రెండు మాత్రమే హిట్స్ అయ్యాయి.. చాలా వరకు శ్రీలీల నటించిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర బోల్తాకొట్టాయి. ప్రస్తుతం ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాల్లో శ్రీలీల నటిస్తుంది. అలాగే మరిన్ని ప్రాజెక్ట్స్ ఈ అమ్మడి చేతిలో ఉన్నట్లు తెలుస్తోంది. సోషల్ మీడియాలో ఈ అమ్మడు చాలా యాక్టివ్ గా ఉంటుంది.

సినీ వాయిస్ CINEMA

# 47 ఏళ్ల వయసులో మరింత అందంగా..

## జ్యోతిక ఫిట్‌నెస్ కోసం ఏం చేస్తుందో తెలుసా.. ?



కొన్ని సంవత్సరాల క్రితం నటి జ్యోతిక వ్యాయామం ద్వారా బరువు తగ్గింది. ఇప్పటికీ ఆమె తన ఫిట్‌నెస్ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉంటుంది. ఆమె సమతుల్య ఆహారం, వ్యాయామాలు చేస్తూ, 47 సంవత్సరాల వయస్సులో కూడా చాలా ఫిట్‌గా ఉంది. తాజాగా జ్యోతిక డైట్, ఫిట్‌నెస్ విషయాలు ఇప్పుడు నెట్టింట వైరలవుతుంది. జ్యోతిక తన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిరోజూ వ్యాయామం చేస్తూనే ఉంది. ఆమె సాధారణ వ్యాయామాలను మళ్లీ రిపీట్ చేయదు. కానీ వాటిలో చాలా మార్పులు చేస్తుంది. ఆమె ఇటీవల చేసిన వ్యాయామాలలో ఒకటి ఇంటర్నెట్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.
జ్యోతిక చేసిన వ్యాయామం ప్లాంక్. ఆమె దానిని డంబెల్ ప్లాంక్ తో ప్రాక్టీస్ చేస్తుంది. దీనిలో, జ్యోతిక తన శరీరం మధ్యభాగాన్ని ఒక బరువుపై ఉంచి తన శరీరాన్ని సమానంగా ఉంచుకునేలా వ్యాయామం చేస్తుంది. ఈ రకమైన ప్లాంక్ వ్యాయామం నడుము కింద భాగపు బలాన్ని, శరీరం మొత్తం బలాన్ని పెంచడంలో సహాయపడుతుందని జ్యోతిక ఫిట్‌నెస్ ట్రైనర్ మహేష్ చెప్పారు. ఈ వ్యాయామం వెన్నునొప్పి ఉన్నవారు చేయకూడదు. ఇది ఒక ప్రొఫెషనల్ పర్యవేక్షణలో మాత్రమే చేయాలి. ఈ వ్యాయామం మన జీవితంలో క్రమశిక్షణను ప్రదర్శించడంలో సహాయపడుతుందని జోవిన్ ట్రైనర్ చెప్పారు. "ఆరోగ్యకరమైన జీవితం అంటే ప్రతిదీ సమతుల్యం చేసుకోవడమే. బరువు తగ్గడానికి ఆహారం ఎంత ముఖ్యమో, శారీరక బలం కూడా అంతే ముఖ్యం" అని జ్యోతిక అంటుంది. ఆమె గత ఇంటర్వ్యూలలో తన ఫిట్‌నెస్ విషయాలు, డైట్ ప్లాన్స్ సైతం పంచుకుంది. ఇదెలా ఉంటే.. కొన్నాళ్లపాటు సినిమాలకు దూరంగా ఉన్న జ్యోతిక.. ఇప్పుడు బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో ఫుల్ బిజీగా ఉంటుంది. మరోవైపు సోషల్ మీడియాలో నిత్యం ఒక ఫోటో షూట్స్ షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది.

క్రీడా వాయిస్

### సఫారీలతో సమరానికి ముందు

# సూర్య మాస్టర్ ప్లాన్..

## అభిషేక్ మళ్లీ పుంజుకుంటాడా?



టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన వేట మొదలైంది. లీగ్ దశలో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయకేతనం ఎగురవేసిన టీమిండియా, ఇప్పుడు సూపర్-8 రౌండ్‌లో తన సత్తా చాటడానికి సిద్ధమైంది. ఆదివారం నాడు అహ్మదాబాద్ వేదికగా గత ప్రపంచకప్ రన్నరప్ సౌతాఫ్రికాతో భారత్ తన మొదటి సూపర్-8 మ్యాచ్ ఆడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు అందరి దృష్టి, అందరి చర్చా ఒక్కరి గురించే.. ఆయనే యువ ఓపెనర్ అభిషేక్ శర్మ. లీగ్ దశలో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో డకౌట్ (సున్నా పరుగులు) అయి నిరాశపరిచిన అభిషేక్ ఫామ్ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. అభిషేక్ శర్మ వరుసగా విఫలమవుతుండటంతో అభిమానులు, విశ్లేషకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కానీ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాత్రం చాలా కూల్‌గా ఉన్నాడు. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో సూర్య చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. "అభిషేక్ ఫామ్ గురించి ఆందోళన పడుతున్న వారిని చూస్తేనే నాకు జాలేస్తోంది. నాకు అభిషేక్ గురించి భయం లేదు, కానీ అతడిని ఎదుర్కోబోయే ప్రత్యర్థి జట్ల గురించి మాత్రం చాలా టెన్షన్ గా ఉంది. గత ఏడాది కాలంగా అభిషేక్ జట్టు కోసం ఎంతో చేశాడు, ఇప్పుడు అతనిపై నమ్మకం ఉంచి ఆ బాకీ తీర్చుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది" అని సూర్య గంభీరంగా సమాధానమిచ్చాడు. ఈ వరల్డ్ కప్ ప్రారంభానికి ముందు అభిషేక్ శర్మను భారత బ్యాటింగ్ వెన్నెముకగా భావించారు. కానీ టోర్నీ మొదలైనప్పటి నుంచి అతడిని దురదృష్టం వెంటాడుతోంది. మొదటి మ్యాచ్‌లోనే సున్నాకే వెనుదిరగడమే కాకుండా, ఆ తర్వాత తీవ్ర అనారోగ్యం పాలై రెండు రోజుల పాటు ఆసుపత్రిలో కూడా ఉండాల్సి వచ్చింది. కోలుకుని జట్టులోకి వచ్చినా తర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ ఖాతా తెరవలేకపోయాడు. ఒకే నెలలో ఆడిన ఎనిమిది టీ20 మ్యాచ్‌ల్లో ఐదు సార్లు సున్నాకే అవుట్ కావడం ఎవరికైనా ఆందోళన కలిగించే విషయమే. కానీ కెప్టెన్ సూర్య మాత్రం అభిషేక్ ఒకే ఒక్క ఇన్నింగ్స్‌తో అన్ని విమర్శలకు చెక్ పెడతాడని నమ్ముతున్నాడు. లీగ్ దశలో పసికూనలపై గెలిచినంత సులభంగా సూపర్-8 ఉండదు. ఇక్కడ సౌతాఫ్రికా వంటి బలమైన జట్టుతో తలపడాల్సి ఉంది. ఒకవేళ సౌతాఫ్రికాతో జరిగే కీలక మ్యాచ్‌లో కూడా అభిషేక్ త్వరగా అవుట్ అయితే మాత్రం టీమిండియా చిక్కుల్లో పడటం ఖాయం. మీడియా ముందు కెప్టెన్ ఎంత ధైర్యంగా మాట్లాడినా, తెర వెనుక మాత్రం ఒత్తిడి ఉందనేది వాస్తవం. అభిషేక్ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మళ్ళీ ఫామ్‌లోకి వస్తాడా? లేక సూర్య నమ్మకాన్ని వమ్ము చేస్తాడా? అనేది ఆదివారం తేలిపోనుంది.

# భారత్ వర్సెస్ సౌతాఫ్రికా సూపర్-8..

## టీమిండియా ప్లేయింగ్-11పై క్లారిటీ వచ్చేసింది భయ్యా



టీ20 వరల్డ్ కప్ 2026లో అసలైన అసలైన సమరానికి తెరలేచింది. ఆదివారం (ఫిబ్రవరి 22) అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా భారత్, సౌతాఫ్రికా జట్లు సూపర్-8 పోరులో తలపడనున్నాయి. గత టీ20 వరల్డ్ కప్ ఫైనలిస్టుల మధ్య జరుగుతున్న ఈ మ్యాచ్ అంటే అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అయితే, ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియా తుది జట్టు విషయంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా మూడు మ్యాచ్‌ల్లో సున్నాకే అవుట్ కావడంతో, అతని స్థానంలో సంజూ శాంసన్‌ను తీసుకుంటారా అన్న సందేహాలు మొదలయ్యాయి. శుక్రవారం జరిగిన ప్రాక్టీస్ సెషన్‌లో సంజూ శాంసన్ నెట్స్‌లో చాలా సేపు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయడంతో, అతను తుది జట్టులోకి వస్తున్నాడనే ఊహాగానాలు జోరందుకున్నాయి. సాధారణంగా మ్యాచ్‌కు ముందు ఎవరైతే ఎక్కువగా ప్రాక్టీస్ చేస్తారో, వారు ప్లేయింగ్-11లో ఉండే అవకాశం ఉంటుంది. ఇదే విషయాన్ని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముందు ఉంచగా, ఆయన చాలా ఆసక్తికరంగా స్పందించారు. "ఏంటి.. సంజూను ఆడించడం కోసం అభిషేక్ శర్మను తప్పించమంటారా? లేక నంబర్-3లో ఆడుతున్న తిలక్ వర్మను పక్కన పెట్టమంటారా?" అంటూ ఎదురు ప్రశ్న వేశారు. దీన్ని బట్టి చూస్తుంటే, టీమ్ మేనేజ్మెంట్ అభిషేక్ శర్మపైనే పూర్తి నమ్మకంతో ఉన్నట్లు అర్థమవుతోంది. జట్టు ప్రదర్శనపై వస్తున్న విమర్శలను కూడా సూర్య సున్నితంగా తిప్పికొట్టారు. "ప్రస్తుతం అంతా బాగానే ఉంది. పవర్‌ప్లేలో 40-50 పరుగులు వస్తున్నాయి. మనం ద్వైపాక్షిక సిరీస్‌లలో భారీ స్కోర్లు సాధించడంతో అందరిలో అంచనాలు పెరిగిపోయాయి. ప్రతి మ్యాచ్‌లోనూ 220-240 పరుగులు చేయాలని ఆశించడం సహజమే. కానీ ఇక్కడి వికెట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయి. గ్రూప్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ పరిస్థితులు వేరుగా ఉన్నాయి, వాటికి తగ్గట్టే మేము ఆడుతున్నాం అని సూర్య చెప్పుకొచ్చారు. ఓపెనింగ్ జోడీలో అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కొనసాగే అవకాశం ఉంది. మిడిల్ ఆర్డర్‌లో తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్, శివమ్ దూబే బలాన్ని ఇస్తారు. బౌలింగ్ విభాగంలో వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్ మధ్య పోటీ ఉన్నప్పటికీ.. వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌కే మొగ్గు ఎక్కువగా ఉంది. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో విశ్రాంతి తీసుకున్న అక్షర్, ఇప్పుడు కీలకమైన సౌతాఫ్రికా మ్యాచ్‌లోకి నేరుగా వచ్చే అవకాశం ఉంది. వరుణ్ చక్రవర్తి స్పిన్ అమ్ములపొదిలో కీలక అస్త్రంగా మారగా, బుమ్రా-అర్షదీప్ పేస్ భారాన్ని

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com